Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
Creating healthy smiles.. with care.
Dr. Aluru Swaroop Kumar Reddy, M.D.S.
10th Anniversary
పొగతోట, నెల్లూరు. 0861-6555555, 9247004747
Nellore, Kavali, Sullurupet, Atmakur, Chennai, Bangalore

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
Longest Living Newspaper in Telugu Journalism
జమీన్‌రైతు
సంపుటి: 83 • సంచిక: 29 • 19-7-2013 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

Hotel D.S.R Paradise
A/C Restaurant
50 varieties of Tandoori
All varieties of Indian & Chinese dishes
Ample car parking
అయ్యప్పగుడి సెంటర్, నెల్లూరు.
ఫోన్ : 2354888, 2308666
సెల్: 8008256888, www.dsrparadise.com

తెలంగాణను తేల్చాల్సింది సోనియాగాంధీనే!

- **సోనియాగాంధీ ఎవరితోనూ మనసువిప్పి మాట్లాడరు.**
- **కాంగ్రెస్ కోలుకోవాలన్నా, జగన్‌ను నిలువరించాలన్నా తెలంగాణ ఇవ్వాలి.**
- **ఈ నెలాఖరు లోపల ఏదో ఒక నిర్ణయం ఖాయమని పరిశీలకుల భావన.**

తెలంగాణ ఇస్తారా, ఇవ్వరా?రాష్ట్రమంతా ఇదే చర్చ. టీవీ ఛానళ్లలో ఇదే రచ్చ. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగలిగింది ఒక్క సోనియా గాంధీ మాత్రమే. ఆమె మనసులో ఏమి వుందో ఎవరికీ అర్థం కావడం లేదు. మనబోటి సామాన్యులకే కాదు, దిగ్విజయ్‌సింగ్, సుశీల్‌కుమార్ షిండే వంటి ఆంతరంగికులు కూడా అయోమయంలో వున్నారు. ఆమె ఇనుప తెరల మధ్య బ్రతికే నేత. ఎవరినీ దగ్గరకు రానివ్వరు. ఏ విషయంలో స్వేచ్ఛగా చర్చ చేయరు. అందరూ చెప్పేది వినడం మాత్రమే ఆమెకున్న అలవాటు. తన అభిప్రాయం మాత్రం బయట పడనివ్వదు. ఆలోచన ముగిసిన తర్వాత నిర్ణయం మాత్రమే చెప్తారు. పార్టీ వ్యవహారాలైనా, ప్రభుత్వ విధానాలైనా ఇదే పద్ధతి. అందులోనూ తెలంగాణ సున్నితమైన అంశం. దాని ప్రభావం ఒక్క ఆంధ్ర రాష్ట్రంతో ఆగదు. జాతి మొత్తం మీద ప్రకంపనలు రేకెత్తుతాయి. అందువల్ల మరింత జాగ్రత్త పాటిస్తున్నారు సోనియాగాంధీ. ఒక అంచనా ప్రకారం తెలంగాణ ఇవ్వడానికే సోనియా సిద్ధపడుతున్నారని చెప్తున్నారు. రేపటి ఎన్నికలలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే ఆంధ్ర నుంచి తగిన సంఖ్యలో ఎమ్పీలు గెలవాలి. ఉత్తరాది మొత్తం మోడి సమ్మోహనా ప్రభంజనంలో కొట్టుక పోతున్నది. అక్కడ సీట్లు బాగా తగ్గి పోతాయన్నది వాస్తవం. అన్ని సర్వే నివేదికలూ ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఆ కొరత పూరించుకోవాలంటే దక్షిణాదిన సీట్లు పెంచుకోవాలి. కానీ జగన్ పుణ్యమా అని ఆంధ్రలో కాంగ్రెస్ పరిస్థితి అధ్వాన్నంగా వుంది. అసలు ఒక్క స్థానమైనా గెలుస్తామా అన్న సందేహం వుంది. అందుకోసమే తెలంగాణ వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. రాష్ట్రాన్ని రెండు భాగాలుగా విడగొట్టి, చెరి 147 ఎమ్మెల్యే స్థానాలు వచ్చేట్లు కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేస్తే రెండు చోట్లా జగన్ బలహీనపడుతాడన్నది వ్యూహం. తెలంగాణ ఇస్తే, ఆ ప్రాంతంలోని అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, మెదక్ జిల్లాలలో కాంగ్రెస్ పరిస్థితి బాగా మెరుగు పడుతుంది. రాష్ట్ర విభజన నిర్ణయం చేస్తే తన టిఆర్ఎస్‌ను విలీనం చేస్తానని గతంలో హామీ ఇచ్చి వున్నాడు కెసిఆర్. ఒకవేళ విలీనానికి ఒప్పుకోకపోయినా పొత్తుకు సిద్ధపడతాడు. అదే జరిగితే తెలంగాణ మొత్తం మీద అధిక స్థానాలు దక్కించుకోవచ్చు. కర్నూలు, అనంతపురం జిల్లాలలో జగన్ గెలుస్తాడు. కానీ ఆ సంఖ్య మొత్తం తెలంగాణ రాష్ట్రం మీద పలచనై పోతుంది. ఆంధ్ర ప్రాంతంలో చిరంజీవిని ముందు పెడితే ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలలో కాపు కులం కాంగ్రెస్‌కు దగ్గర కావచ్చునని ఒక అంచనా. కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలలో జగన్ అధిక స్థానాలు గెలిచినా, తతిమా ఆంధ్ర ప్రాంతాలలో కాంగ్రెస్ ఎంతో కొంత లాభ పడుతుంది.

తెలంగాణ అంశం ఈ స్థాయిలో వెలుగులోకి రావడానికి ఈ రాజకీయ కోణమే కారణమని చెప్పకుండానే అర్థమై పోతున్నది. నిజానికి గత ఆరేడు నెలలుగా తెలంగాణ ఉద్యమం బలహీనంగా నడుస్తున్నది. కెసిఆర్‌కు, జెఏసికి సరిపడడం లేదు. కెసిఆర్ అధిక భాగం తన ఫాం హౌస్‌లో విశ్రాంతి తీసుకొంటున్నాడు. ఏ సభ పెట్టడం లేదు. ఏ ఉద్యమంలోనూ భాగం పంచుకోవడం లేదు. అయినా కాంగ్రెస్ పార్టీ తనంతట తానుగా తెలంగాణను తెర మీదకు తెచ్చిందంటే అందుకు కారణం ఎన్నికలలో లెక్కలే.

ఈ నెలాఖరు లోపల జరిగే సిడబ్ల్యుసి సమావేశంలో ఈ విషయమై ఒక నిర్ణయం రావచ్చునని అంచనా. అధికభాగం అవకాశాలు తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగానే కన్పిస్తున్నాయి. అయితే ఆ నిర్ణయం అమలు చేయడంలో కాంగ్రెస్ చిత్తశుద్ధి మీద మాత్రం ఎవరికీ నమ్మకం లేదు. రాష్ట్ర విభజన కోరుతూ శాసనసభలో తీర్మానం ప్రతిపాదించమని కోరవచ్చు. అది జరగని పని. ఆ తీర్మానం పెడితే శాసనసభ అల్లకల్లోలమౌతుంది. ఏ తీర్మానమూ జరగదు. అల్లరి ఆగంతో సభ రద్దయి పోతుంది. ఆ సాకు చూపించి ప్రతిపక్షాలు సహకరించలేదనే కారణంతో నిర్ణయాన్ని వాయిదా వేయవచ్చు. దాని వల్ల అటు తెలంగాణ ఇచ్చినట్లే కన్పడి, ఇవ్వకుండా దాట వేయవచ్చు.

మొత్తానికి సోనియాగాంధీ రాష్ట్రంలో ఒక రాజకీయ నాటకానికి నాంది పలుకుతున్నారు. ఆ నాటకం వినోదప్రాయంగా వుంటుందా విధ్వంసంగా మారుతుందా అన్నది కాలమే తేల్చాలి.

జైపాల్‌రెడ్డి చుట్టూ రాష్ట్ర రాజకీయం!

పెట్రోలియం మంత్రిగా పక్కకు తప్పుకొన్నప్పటి నుంచీ నిశ్శబ్దంగా, ఇంటి పట్టునే వుండి పోతున్న కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి ఒక్కసారిగా వెలుగులోగి వచ్చాడు. ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలన్నీ ఆయన చుట్టూనే తిరుగుతున్నాయి. నిజానికి జైపాల్‌రెడ్డికి ఇదొక కొత్త అనుభవం. దాదాపు 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయన ఒంటరి జీవితమే గడిపాడు. జాతీయస్థాయి నేతగా గుర్తింపు పొందినా జిల్లాస్థాయిలో తన మనిషి అని చెప్పుకోవడానికి ఒక్కరూ కన్పించరు ఆయనకు. పార్టీ వ్యవహారాలలో ఏనాడూ క్రియాశీలక పాత్ర పోషించడు. అది ఆయన తత్వానికి విరుద్ధం. తన పలుకుబడితో పని చేయించుకొనే అతి కొద్ది మంది ధనవంతులు, పారిశ్రామికులతో మాత్రమే మాట్లాడుతాడాయన. సాధారణ రాజకీయా కార్యకర్తలు, చిన్నపాటి నేతలు తన ఇంటికి వచ్చినా పెద్దగా పట్టించుకోడు. ఇంటర్వ్యూ ఇవ్వడు. అయితే తెలంగాణ ప్రాంతం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో వున్న ఏకైక పెద్ద నేత కాబట్టి ఈ మధ్య డి.శ్రీనివాస్, జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి తెలంగాణ ప్రాంత కాంగ్రెస్‌వాదులు తరచు ఆయన్ను కలుస్తున్నారు. రాష్ట్ర విభజన ఉద్యమానికి సంబంధించి సలహాలు, సంప్రదింపులు చేస్తున్నారు. అయితే వున్నట్లుండి సోనియాగాంధీ ఆయన్ను వెలుగులోకి తెచ్చింది. రాష్ట్ర పరిశీలకుడు దిగ్విజయ్ సింగ్ ఆయన ఇంటికి వెళ్లి గంట పాటు మంతనాలు జరిపి వచ్చాడు. ఆ వెంటనే జైపాల్‌రెడ్డి హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండేను కలిశాడు. ఈ చర్చల సారాంశం ఏమిటో ఎవరికీ తెలియదు. అయితే తెలంగాణ వివాద పరిష్కారంలో జైపాల్‌రెడ్డి అనుభవాన్ని, విజ్ఞతను వాడుకోవాలనే తలంపు సోనియాగాంధీకి కల్గిందని మాత్రం అర్థమౌతున్నది.

తెలంగాణ రాష్ట్రం అంటూ ఏర్పడితే ముఖ్య
కొరవ 14వ పేజీలో

జగన్ ఉనికి రుజువైంది!



రాష్ట్ర రాజకీయాలలో వైఎస్ జగన్ అవకాశాల మీద విస్తృత చర్చ వుంది. రేపటి ఎన్నికలలో ఆయన అధికారంలోకి వస్తాడా రాడా, జైలు జీవితం, సిబిఐ కేసుల వల్ల ప్రజలలో పోను పోను ఆయన ప్రాబల్యం తగ్గిపోతుందా, అసలు నేత జైలులో మ్రగ్గుతుంటే పార్టీని నడిపేదెవరు, ఎన్నికల నాటికి అసలు ఒక పార్టీగా మనుగడ నిలుపుకోగల్గుతుందా లేదా అన్న ప్రశ్నలు సాధారణ ప్రజలలో కూడా చర్చలో వున్నాయి. ఉప ఎన్నికలలో ఆయన పార్టీ ఘన విజయాలు సాధించినప్పటికీ, సాధారణ ఎన్నికలలో అవి పునరావృతం అవుతాయా కావా అన్న ప్రశ్న విన్పిస్తున్నది. ఇప్పుడు జరగుతున్న పంచాయితీ ఎన్నికలు ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పాయి. రాష్ట్రం మొత్తం మీద ఏకగ్రీవంగా ఎంపికైన సర్పంచులలో దాదాపు 30 శాతం వైఎస్ఆర్ కాంగ్రెస్‌వాదులుగా తేలారు. సీమాంధ్రలోని కొన్ని జిల్లాలలో 50 శాతానికి పైగానే వైఎస్ఆర్ కాంగ్రెస్ సర్పంచులు ఎన్నికైనారు. అసలు ఉనికే లేదను కొన్న తెలంగాణలో కూడా చెప్పుకోదగిన స్థాయిలో పంచాయితీలు దక్కాయి. జగన్ జైలులో వున్నా, ఆ పార్టీ ఉనికికి ఢోకా లేదని నిరూపించాయి పంచాయితీ ఎన్నికలు. కాంగ్రెస్, టిడిపిలకు ఆందోళన కల్గించే పరిణామం ఇది. రేపటి ఎన్నికలలో రెండు ప్రధాన పార్టీలకు ఏ మాత్రం తగ్గకుండా పోటీ ఇవ్వగల్గిన స్థాయికి చేరుకొన్నది జగన్ పార్టీ. ఆయన్ను ఎట్లా నిలువరించాలన్నదే ఇప్పుడు ఆ రెండు పార్టీలకు పెద్ద సమస్య. తెలంగాణ అస్త్రంతో కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తుంటే, మోడి ప్రభంజనం తోడు చేసుకొందామని తెలుగు తమ్ముళ్లు తమ నేత మీద ఒత్తిడి పెంచుతున్నారు.

తొణకని గిరిజన స్వరం!

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్ర సూర్యనారాయణ దేవ్, జాతీయ కాంగ్రెస్ నేతలలో అత్యంత గౌరవనీయుడు. పదవుల కోసం కాక ప్రజల కోసం ఆలోచన చేసే అరుదైన రాజకీయవాది. పదవి వచ్చినా, రాకున్నా ఆయన తీరులో మార్పు వుండదు. 2009 ఎన్నికల తర్వాత ఆయన్ను లోక్‌సభ స్పీకర్‌గా ఎంపిక చేసింది సోనియాగాంధీ. ఎందు వల్లనో వీలు కాలేదు. కానీ కిశోర్ చంద్రదేవ్ ఒక్కరిని తప్ప పట్ట లేదు. పదవి రాలేదనే చింత అసలే లేదు. ఎన్నికలు ముంగిట్లోకి వచ్చిన తర్వాత ఆయన్ను కేంద్ర మంత్రి చేసింది సోనియమ్మ. ఎప్పుడో రావలసిన ఆ పదోన్నతి ఇంత ఆలస్యంగా వచ్చినా పదవిని తృణప్రాయంగా చూస్తున్నాడు కిశోర్ చంద్రదేవ్.

ఆయన గిరి పుత్రుడు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన గిరిజనులకు కుల పెద్ద. జమీందారీ హోదా కల్గిన వాడు. అందువల్ల గిరిజన జీవితాలతో దగ్గరి సంబంధం, సంపర్కం, గిరిజనుల సంక్షేమం కోసం ఎవరినైనా ఎదిరించే స్థైర్యం వుంది. అరకు లోయ ప్రాంతంలో బాక్సైట్ ఖనిజం తవ్వకాల విషయంలో మడమ తిప్పని పోరాటం చేస్తున్నాడు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఈ గనుల కేటాయింపు జరిగింది. బాక్సైట్ ఖనిజం, కొండల శిఖర భాగంలో వుంటుంది. దాన్ని వెలికి తీయాలంటే గిరి శిఖరాలను ధ్వంసం చేయాలి. కొండల భౌగోళిక స్వరూపం తెలిసిన వారికి అదెంత వినాశన చర్యో అర్థమౌతుంది. శిఖర భాగాన్ని త్రవ్వితే, కొండ క్రింది భాగం కూడా కదలి పోతుంది. దానితో చిన్నపాటి వానలకే కొండ చరియలు విరిగిపడతాయి. కొండ అగ్ర భాగాన వుండే జల వనరులు, చిన్నపాటి సరస్సులు అదృశ్యమైపోతాయి. దానితో కొండ మొత్తం మీద భూగర్భ జలం అంతరించి చెట్టు పుట్ట ఎండిపోతాయి. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు వ్యవసాయ భూమి వుండదు. కొండ పై అంచులలో కొద్ది కొద్దిగా చదును చేసి పోడు వ్యవసాయం చేస్తారు. గనుల త్రవ్వకం వల్ల వారికి జీవనాధారం లేకుండా పోతుంది. ఒకప్రక్క చెట్టు పుట్ట ఎండిపోయి, జల వనరులు అంతరించి, మరొకప్రక్క వ్యవసాయం వీలు కాని పరిస్థితి వస్తే గిరిజనులు అక్కడ నుంచి వలస పోవడం తప్ప మార్గాంతరం లేదు. గిరిజనుల జీవన శైలి భిన్నమైనది. నాగరికతకు ఇప్పటికీ చాలా దూరంలో బ్రతుకుతున్నారు వారు. మైదాన ప్రాంతాలలో నాగరికుల మధ్య జీవనం అంటే నీళ్లలో నుంచి చేప పిల్లను ఒడ్డున పడేసిన దానితో సమానం. అడవుల మీద కొండల మీద గిరిజనులకు సహజసిద్ధమైన హక్కు వుంది. కొన్ని వేల తరాలుగా వారి జీవనం అక్కడే. అక్కడి చెట్టు పుట్టతో మమేకమై వుంటారు వారు. గిరిజనులకు అన్యాయం జరిగినప్పుడు సమాజంలో ప్రతి స్పందన చాలా స్వల్పంగా వుంటుంది. అందువల్లనే గిరిజనులు అన్ని రకాల దోపిడీకి గురౌతూ వుంటారు. అభివృద్ధి పేరిట ఇప్పుడు ప్రభుత్వాలే గిరిజనుల జీవితాలను ఛిద్రం చేయడానికి సన్నద్ధమౌతున్నాయి.

ఈ క్రూరమైన పోకడను అత్యంత తీవ్రంగా ప్రతిఘటిస్తున్నాడు కిశోర్ చంద్రదేవ్. అరకు లోయలో బాక్సైట్ గనుల కిచ్చిన అనుమతులను రద్దు చేయమని గవర్నర్‌కు సలహా ఇచ్చారాయన. కానీ ప్రభుత్వ కనుసన్నలలో నడిచే ఏ గవర్నర్ కూడా అందుకు సిద్ధపడడన్నది నిజం. దానితో అవసరమైతే గిరిజనుల హక్కుల పరిరక్షణకు ప్రత్యక్ష పోరాటానికి కూడా తాను సిద్ధమని, తాను ఎమ్పీగా వున్నన్ని రోజులూ అరకు లోయలో బాక్సైట్ త్రవ్వకం జరపనివ్వనని ప్రతిన పూనాడు. అయినా కేంద్ర ప్రభుత్వం తన మానాన తాను పారిశ్రామికుల అనుకూల నిర్ణయాలు తీసుకొంటూనే వుంది. దీనితో విసిగి పోయిన కిశోర్ చంద్రదేవ్, తాను కేంద్రమంత్రి అన్న మాట కూడా మరచిపోయి, మన్మోహన్‌సింగ్ ఆర్థిక విధానాల వల్లనే గిరిజన ప్రాంతంలో మావోయిస్టుల ప్రాబల్యం పెరిగిపోతున్నదని, ఎన్నో తరాలుగా గిరిజనులను నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు తమ హక్కుల కోసం పోరాడుతుంటే వారిని మావోయిస్టులుగా ముద్రవేసి చంపుతున్నారని ఘాటైన ప్రకటన చేశాడు. ఒక కేంద్ర మంత్రి ప్రధాని మీద ఇంత తీవ్ర వ్యాఖ్యలు చేయడం విచిత్రమైన విషయం. కానీ కిశోర్ చంద్రదేవ్ వ్యాఖ్యలకు దొంగకు తేలు కుట్టిన చందంగా గమ్ముగుండి పోతున్నాడు ప్రధానమంత్రి.

జమీన్‌రైతు

దేశం అభివృద్ధి చెందాల్సిందే, అందుకు దేశంలో లభించే సహజ వనరులను వినియోగించుకోవాల్సిందే. అయితే ఆ పేరుతో సామాజిక విధ్వంసానికి, ప్రకృతి వినాశనానికి పాల్పడి, అమాయక గిరిజనులను వారి నివాసాల నుంచి తరిమి వేయడం మాత్రం సమర్థనీయం కాదు. అభివృద్ధికి, సామాజిక న్యాయానికి మధ్య సరైన సమతౌల్యం పాటించడం ప్రభుత్వం కర్తవ్యం. ఆ పాటింపు లేదు కాబట్టే కిశోర్ చంద్రదేవ్ వంటి ప్రభుత్వ భాగస్వాములు సైతం ప్రభుత్వ విధానాలను నిరసిస్తున్నారు. పదవి పోతుందన్న భయం లేకుండా నోరులేని మూగ జీవాల వంటి గిరిజనుల వాణిని జాతీయ స్థాయిలో విన్పిస్తున్న కిశోర్ చంద్రదేవ్‌ను మనసారా అభినందిస్తున్నాము.

జనవాక్కు

ప్రభుత్వం హత్యలు చేయించడమేమిటి?

మాజీ మావోయిస్టు గంటి ప్రసాదంను నెల్లూరు నడివీధిలో కాల్చి చంపారు. ప్రసాదం నర హంతకుడు కాదు. ప్రతి మనిషికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వుండాలని ఆకాంక్షించే వ్యక్తి. ప్రసాదంను ప్రభుత్వమే ఒక పథకం ప్రకారం చంపించిందని ప్రగతిశీల ప్రజాస్వామ్యవాదులు ఆరోపిస్తున్నారు. ప్రజాస్వామ్య రాజ్యంలో రాజరిక పాలన తలపిస్తూ ప్రశ్నించే వ్యక్తులను హత్యలు చేస్తూ పోవడం సహేతుకం కాదు.

షేక్ ఫజల్ నెల్లూరు

అహింసామూర్తి చెంత పేలుళ్లు!

బుద్ధగయ ప్రాంగణాన్ని బద్ధలు కొట్టడానికి 7తేది జరిగిన భీభత్స యత్నాన్ని అహింసావాదులంతా ముక్తకంఠంతో ఖండించాలి. దేశంలో కొనసాగుతున్న జాతీయ వైఫల్యానికి ఇదో భయంకర నిదర్శనం. గత ఏడాది ఢిల్లీలో జూలైలో జరిగిన సమావేశంలో బుద్ధ గయకు భీభత్సకారుల నుండి పొంచివున్న ప్రమాదాన్ని గూర్చి చర్చించారట. అక్టోబర్ నెలలో ఈ విషయమై హెచ్చరించిన కేంద్ర 'నిఘా' విభాగం వారికి ప్రమాదం ఎవరి వల్ల ఉందన్న విషయం తెలియదా? తెలిసినట్టయితే వారి కదలికను పసిగట్టి ముందుగానే వారిని నిర్భంధించడానికి ఎందుకు ప్రయత్నించలేదు. ఎన్ఐఏ కాని ఎన్ఎస్జి కాని ఎందుకని రంగంలోకి దిగి గాలింపు జరపలేదు. ఇప్పటికైనా ఇటువంటి విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంగా వ్యవహరించడం నేర్చుకోవాలి. లేకుంటే హైదరాబాద్ దిల్‌షుఖ్ నగర్ లాంటి పేలుళ్లు జరుగుతూనే వుంటాయి.

కెవి.రమణ నెల్లూరు

దేశభక్తులు కోకొల్లలు!

రిజర్వు బ్యాంక్ ముద్రించే కరెన్సీ నోట్ల మీద జాతిపిత గాంధీజీ బొమ్మ మినహా మరొకటి కనపడడం లేదు. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ గారితో పాటు పాల్గొని ప్రాణాలు సైతం పోగొట్టుకొన్న వీరులెందరో ఉన్నారు. నేతాజీ, శివాజీ, వివేకానందుడు, ఉరికంబాన్ని ముద్దాడి ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్, దేశంలోని వందలాది సంస్థానాలను విలీనం చేసేందుకు కృషిచేసిన సర్దార్ వల్లభాయి పటేల్ వంటివారెందరో ఉన్నారు. కాబట్టి గాంధీజీ తోపాటు ఇతర అమరవీరులు, మహాపురుషుల బొమ్మలతో కరెన్సీ నోట్లు విడుదల చేయమనవి.

ఎం.సత్యానందం నెల్లూరు

అధికారాలివ్వండి!

ఈ నెలాఖరుకు పంచాయితీ ఎన్నికలు పూర్తవుతాయి. ఆ తర్వాత ఎమ్పీటిసి, జడ్పీటిసి, మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయి. సర్పంచులు, సభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు, ఛైర్మన్‌లు, మేయర్లు, పదవుల్లో కొలువు తీరుతారు. కానీ

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

23-7-1943
పేజీలు : 4 వెల: అణా

గ్రామాల విషయాలు

ద్రౌపది దేవిని పంచ పాండవులు ఏటా ఒకరు పంచుకొన్నట్లు మా గుడ్డి కుంకాళమ్మ పెత్తనం గూడా మా రెడ్లు ఏటా ఒకరు పంచుకొంటారు. ఈ సంవత్సరం పెత్తనం రాజమాన్య రాజపూజితుడైన ప్రొఫెసర్ రమణయ్య చేతికింది కొచ్చింది. కుంకాళమ్మ ఆస్తిపాస్తుల్లో ఏ లోటు లేకుండా ఈ నాటికీ దర్జాగా జరుపుకునే స్థితిలో ఉన్నా ఈ యేడు ఆమె తిరునాళ్ల ఆడంబరం లేకుండా ఓ మోస్తరుగా వెళ్లదోశాడు. శేషపాన్పు అలంకారం లేకపోయినా, లయిట్ల ప్రకాశం సన్నగిల్లినా, అమ్మోరికి చల్ల పోలి మాదిరి చాలీ చాలని చీరగట్టినా అలంకారం, పూల తేరు బాగున్నవి. కొర్లు వరిగొండోళ్ల పిల్లోడంత పొడుగు – పొరోహితుడు సుబ్రమణ్యమంతలావు గట్టినందున బ్రాహ్మణార్థపు బ్రాహ్మడి మాదిరి కొంచెం భుక్తాయాసంతో ఆలస్యంగా లేచినవి. 6గంటలు లేటైనా అగ్నిగుండం నడిచి తీరింది.

రమణన్నా ఈ గొడవ నీకెందుకు? అభినవ నారద బ్రహ్మ సుబ్బారెడ్డి నెత్తిన దోస్తే పోదా?

–ఆకాశ రామన్న

రూ.600ల చిల్లర నాణ్యాలు పట్టుబడుట!

సూళ్లూరుపేటలో యిరువురు స్త్రీలు రూ.600లు చిల్లర నాణ్యాలు మార్చుకొని పోతున్నందున పోలీసులు చిల్లరతో గూడా వారిని పట్టుబరచుకొనిరి.

–బ.వి

50 ఏళ్ల క్రితం ఈవారం

19-7-1963
పేజీలు: 12 వెల: 0-20 న.పై

కేంద్ర మంత్రి వర్గం

అనారోగ్య కారణాలతో కె.సి.రెడ్డి యిచ్చిన రాజీనామా అంగీకరించబడింది. ప్రముఖ ఇంజనీరు, ఆంధ్రుడు, విజయవాడ పార్లమెంటు సభ్యుడైన డాక్టర్ కె.ఎల్.రావు ఇరిగేషన్, విద్యుత్ శాఖల స్టేట్ మంత్రిగా నియమింపబడినారు. ఈ శాఖలు ఇదివరలో హఫీజ్ మహమ్మద్ ఇబ్రహీం నిర్వహించేవారు. కె.డి.మాళవ్యా గారి గనులు, ఇంధనపు శాఖలు ఓవి అలగేశన్‌కు యివ్వబడినవి. కేంద్ర మంత్రివర్గంలో ఇంతకంటే మార్పు లేమీ జరగలేదు.

నెల్లూరు ముచ్చట్లు

బుచ్చి సమితి

సమితి రాజకీయాలలోనేగాక ఇతరత్రా గూడా ఎంతో విహితంగా ఉండిన దొడ్ల వారు, కమ్యూనిస్టులు మొన్న స్వర్గీయ కాలేషా స్థానంలో సమితి సభ్యత్వానికి జరిగిన ఎన్నికలో పరస్పరం ఢీ కొన్నారు. దొడ్లవారి అభ్యర్థి బెజవాడ దశరధరామరెడ్డికి 17 ఓట్లు వస్తే, కమ్యూనిస్టు అభ్యర్థి సత్యవోలు ఆదినారాయణరెడ్డికి 3 ఓట్లు వచ్చాయట. ఈ సమితిలో కమ్యూనిస్టుల నిజ బలం యిది.

మేనకూరు వారి వర్గం ఈ ఎన్నికలో కమ్యూనిస్టులను మాత్రం బలపరచగూడదనే వైఖరితో వ్యవహరించినట్లుంది. వీరిలో హాజరైన కొందరు ముఖం తప్పించారు. కొందరు తటస్థం వహించారు. కొందరు దొడ్ల వారికి ఓటు జేశారంటారు.

నెల్లూరు ముచ్చట్లు

వర్షం

కాసేపు ముసురుపట్టి వర్షం కురవడం ఆ తర్వాత మళ్లీ ఎండ అదర గొట్టడం ఈ వారం విశేషంగా చెప్పుకోవచ్చు. 12, 13 తేదీలతోపాటు 15, 16 తేదీల్లో రాత్రి కూడా నెల్లూరులో ఓ మోస్తరు వర్షం పడింది. జిల్లా అంతటా ఇదే పరిస్థితి మధ్య రైతులు విత్తనాలు చల్లుకోను, నారుమళ్లు దున్నుకోవడం ఆరంభించారు.

ఎస్పీ ఉండేది జనవరి వరకేనా?

ఎస్పీగా పివిఎస్ రామకృష్ణ జిల్లాలో వచ్చే ఏడాది జనవరి నెలవరకే విధులు నిర్వహించేట్లున్నారు. రామకృష్ణకు ప్రభుత్వం ఇటీవలే డిఐజి హోదా ఇచ్చింది. పంచాయితీ ఎన్నికలను పురస్కరించుకొని ఆయన్ను హడావుడిగా నెల్లూరు ఎస్పీగా పంపారు. జనవరి నెలలో డిఐజి పోస్టులు కొన్ని ఖాళీ అవుతాయి. అప్పుడు రామకృష్ణ గారికి పోస్టింగ్‌తోపాటు బదలీ తప్పదు. అప్పటి వరకు నెల్లూరు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హోదాలో రామకృష్ణ ఇక్కడే పనిచేస్తారు.

భారతదేశం భవిష్యత్తుపై చర్చ!

దివాలా అంచుకు చేరుతున్న దేశం అనే అంశంపై కావలిలోని నా ఫౌండేషన్ ఈ నెల 28వ తేది క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో చర్చావేదికను ఏర్పాటు చేసింది. జమీన్‌రైతు సంపాదకుడు నెల్లూరు డోలేంద్రప్రసాద్ ఈ చర్చా వేదికకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. దేశంపై మక్కువ ఉన్న వారంతా ఈ చర్చా వేదికలో పాల్గొనవచ్చంటున్నాడు నా ఫౌండేషన్ నిర్వాహకుడు ఎల్.సుధాకర్‌రెడ్డి.

ఢిల్లీ ఇంటర్వ్యూకు కలెక్టర్!

నెల్లూరు కలెక్టర్‌గా నాగులపల్లి శ్రీకాంత్ కుదురుకోక మునుపే ఆయన్ను ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీ పోస్టుకు ఇంటర్వ్యూకు పిలిచారు. 13వ తేది దీనికి హాజరై 15వ తేది నెల్లూరుకు తిరిగి వచ్చారాయన. దేశంలో కేవలం ఆరు మంది యువకులు, చురుకైన ఐఏఎస్ అధికారులను ఈ ఇంటర్వ్యూకు పిలిచారు. ఒకవేళ కలెక్టర్‌గారు ఈ పోస్టుకు ఎంపికైతే మనకు పంచాయితీ ఎన్నికల తర్వాత కొత్త కలెక్టర్ రాక తప్పదు.

ట్రాఫిక్ అబందర

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ నడత మామూలుగానే పద్మవ్యూహాన్ని తలపింపజేస్తుంది. అటువంటిది ఒక్కసారిగా ట్రంకు రోడ్డును మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం నుంచి నెహ్రూ బొమ్మ వరకు విస్తరించను పనులు మొదలు పెట్టడంతో ఈ రోడ్డుపై తూర్పువైపే ట్రాఫిక్ నడుస్తుంది. పోలీసాఫీసు వద్ద కొత్తరోడ్డు నిర్మాణం, మినీబైపాస్ రోడ్డులో విస్తరణ పనులతో నగరంలో ట్రాఫిక్ చిందరవందర గందరగోళమయ్యింది. మరో మూడు నెలలపాటు ఇదే పరిస్థితి కొనసాగేటట్లుంది. రోడ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ పోలీసుల చేత సిఐలు సురేష్ కుమార్‌రెడ్డి, సుబ్బారావులు ఇంకొస్త ఓపికతో డ్యూటీ చేయించాల్సి వుంది.

పోటాపోటీగా హలీం సెంటర్లు!

రంజాన్‌ను పురస్కరించుకొని నెల్లూరు వహాబ్‌పేట, ఆచారివీధి, బారకాసుల్లో పోటీగా హలీం వంటకం తయారుచేసే కేంద్రాలు పెట్టారు. హలీం శక్తివంతమైన ఆహార పదార్థం. హైదరాబాద్ హలీం ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన వంటకం. నెల్లూరులో పోటాపోటీగా సెంటర్లు అయితే పెట్టారు గానీ వంటకం మాత్రం హైదరాబాద్‌లో మాదిరి రుచిగా లేదు. నిర్వాహకులు ఇది గమనించినట్లులేదు.

ప్రత్యేక రాష్ట్రం రాదు!

ఆంధ్రప్రదేశ్‌ను విడదీయరని కాంగ్రెస్ కోర్ కమిటీలోగానీ, సిడబ్ల్యుసిలో గానీ ఈ అంశంపై చర్చించే అవకాశమే లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నొక్కి వక్కాణించారు. 14వ తేది నెల్లూరులో సమైక్యాంధ్ర విద్యార్థి జెఎసి నిర్వహించిన సమావేశంలో వివేకానందరెడ్డి పాల్గొని మాట్లాడారు. టిఆర్ఎస్ నేత కె.చంద్రశేఖర్‌రావు లబ్దికోసమే ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతున్నాడు. చంద్రశేఖర్‌రావుకు సిఎం కుర్చీ, ఆయన కుమారుడు తారక రామారావుకు డిప్యూటీ సిఎం పదవి, కుమార్తెకు ఢిల్లీలో పదవి, అల్లుడికి మంత్రి పదవులు కట్టబెట్టాలనే ఏకైక అజెండాతో ఆయన పని చేస్తున్నాడు. దీన్ని అన్ని రాజకీయ పార్టీలు ముక్త కంఠంతో ఖండించాలన్నారు.

పెనాల్టీ కట్టి బంగారు విడిపించుకొన్నారు!

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ఈ వారంలో రెండు బ్యాగుల్లో దొరికిన 35 కిలోల బంగారు నగలు సంచలనం సృష్టించాయి. ఇది తమ బంగారమేనని మండపాలవీధిలోని కెబి గోల్డ్ షాపు వారు ముందుకు రావడంతో కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ 26 లక్షల రూపాయలు పెనాల్టీ ట్యాక్స్ వేసి ఈ బంగారు ఆభరణాలు తిరిగి వారికి అప్పగించడంతో ఈ రచ్చకు తెరపడింది.

మళ్లీ దొరికిన బంగారం

నెల్లూరులో బిల్లులు గట్రా లేకుండా కోట్లాది రూపాయలు విలువ చేసే బంగారు లైన్ బిజినెస్ జరుగుతుంది. నగరంలోని స్వర్ణకారులు కొన్ని ఆభరణాలు

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online‌లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజి బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 1068110110004 23లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354


సెల్: 98489 66190

తయారు చేయడంలో నేర్పరులు. ఈ విధంగా తయారుచేసిన వస్తువులను బయటకు అమ్మకానికి మార్వాడీలు పంపుతున్నారు. వచ్చే సమయంలో వెళ్లిన వాళ్లు అక్కడ ప్రసిద్ధిగాంచిన బంగారు ఆభరణాలు తెస్తుంటారు. 14వతేది పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో తిలక్‌రాజ్ అండ్ సన్స్ సంస్థ నుంచి సంజయ్ 3.8 కిలోల బంగారు ఆభరణాలు తెచ్చి కనకమహల్ సెంటర్‌లోని ఆర్ఆర్ లాడ్జిలో దిగాడు. పంచాయితీ ఎన్నికలను పురస్కరించుకొని రొటీన్ సోదాలు చేస్తున్న మూడవ పట్టణ సిఐ కెవిరత్నం కంటికి ముత్యాలు, కెంపులు, రాళ్లు పొదిగిన నగలు కనపడడంతో వీటిని స్వాధీనం చేసుకొని ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ బంగారాన్ని సైతం శాంతి కైలాష్ జ్యూయల రీస్ వారు లక్షా 40వేల రూపాయలు ట్యాక్స్ పెనాల్టీగా కట్టి విడిపించుకొన్నారు.

పెద్ద చోరీ

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో అరుణాచలం వీధిలో నివాసం ఉండే సర్వోదయ కాలేజి రిటైర్డ్ లెక్చరర్ ఇంట్లో 14వ తేది పట్టపగలు పెద్ద చోరీ జరిగింది. 200 సవర్ల బంగారు, 20 కిలోల వెండి, రెండు లక్షల రూపాయల నగదు బీరువాలోంచి దొంగలు పట్టుకెళ్లిపోయారు. ఇదంతా లెక్చరర్ కుటుంబసభ్యులు రాజరాజేశ్వరమ్మ దేవస్థానానికి వెళ్లి వచ్చేలోపే జరిగిపోయింది. సంఘటనా స్థలాన్ని ఎస్పీ రామకృష్ణ సందర్శించారు. బాగా చూసే ఈ దొంగతనం చేశారని పోలీసులు చెబుతున్నారు. దర్యాప్తులోగానీ దొంగలెవరనేది బయటపడదు.

రైల్వే బోర్డు సభ్యునిగా పత్తి సీతారాంబాబు!



సౌత్ సెంట్రల్ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ (జడ్‌యూఆర్‌సి) కమిటీ సభ్యునిగా పత్తి సీతారాంబాబు నియమితులయ్యారు. రెండేళ్లపాటు ఈయన పదవిలో ఉండి జోనల్ పరిధిలో రైల్వే ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సలహాలిస్తారు. సీతారాంబాబు ట్రంకురోడ్డులో సాయినాథ్ అండ్ కో వ్యవస్థాపకుడు దివంగత పత్తి నరసింహులుశెట్టి మనుమడు, రవీంద్రబాబు కుమారుడు. తొలి పదవి పొందిన సీతారాంబాబుకు మా అభినందనలు.

విఐపి సర్పంచులు!

నెల్లూరు రాజకీయాల్లో ఉవ్వెత్తున ఎగసిన కెరటాలు మాజీ జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డిలు తమ తల్లులను సైతం సర్పంచుల పీఠమెక్కించారు. కాకాణి లక్ష్మీకాంతమ్మ తోడేరు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికకాగా అనంతసాగరం మండలం లింగంగుంట సర్పంచ్‌గా మెట్టుకూరు అమ్మణ్ణమ్మ ఎన్నికయ్యారు. లక్ష్మీకాంతమ్మ గతంలోనూ సర్పంచ్‌గా వ్యవహరించారు.

జీవప్రదాతకు సజలనయన ప్రణామం!



20వ తేదికి 20 సంవత్సరాలు గడుస్తాయి – ఈ 20 సంవత్సరాలు ఇరవై యుగాలుగా కన్పిస్తున్నాయి. తుది శ్వాస విడిచే వరకు పత్రికా సంపాదకత్వమే తన ప్రాణంగా భావించి, పత్రిక భవిష్యత్తు కోసం జీవితం పణంగా పెట్టిన జమీన్‌రైతు జీవప్రదాత నెల్లూరు శ్రీరామమూర్తి గారి ఎడబాటు – ఎన్నేళ్లు గడిచినా దుర్భరంగానే కన్పిస్తున్నది. 20వ వర్ధంతి సందర్భంగా సజల నయనాలతో ఆయన్ను స్మరించుకొంటున్నాము; ప్రణమిల్లు తున్నాము.

- జమీన్‌రైతు కుటుంబం

కేర్ దంత వైద్యశాల వార్షికోత్సవం!

నెల్లూరు పొగతోటలోని కేర్ దంత వైద్యశాల 10వ వార్షికోత్సవ వేడుకలు 16వ తేది ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హాస్పిటల్ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31వ తేది వరకు ఉచిత కన్సల్టేషన్‌తోపాటు స్పెషాలిటీ వైద్య సేవలపై 25 శాతం రాయితీ అందిస్తున్నామని తెలిపారు. అందరి సహకారం వల్లే కావలి, సూళ్లూరుపేట, ఆత్మకూరులతోపాటు చెన్నై, బెంగుళూరులలో కేర్ దంత వైద్యశాల బ్రాంచీలు స్థాపించ గలిగామని తెలిపారు.

కొరవ 14వ పేజీలో

వజ్రం - బంగారం - వెండి ఫ్యాక్టరీ అవుట్‌లెట్

BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై* తరుగు 6% నుండి - కూలి లేదు.

వెండి వస్తువులపై* తరుగులేదు - కూలిలేదు.

డైమండ్స్‌పై 10% తగ్గింపు*

*T&C Apply

గోల్డ్ ప్యాలెస్

ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.

ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్

925 STERLING SILVER* EXPORT QUALITY

వెండి వస్తువులపై* తరుగు లేదు, కూలి లేదు.

*T&C Apply

సిల్వర్ ప్లాజా

EXCLUSIVE SILVER SHOW ROOM

(A Unit of Gold Palace)

ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.

ఫోన్: 2331132, 2331121

సమీక్షలు జరిపారు - సౌకర్యాలు నిల్!



చిన్నబజారు మసీదు సమీపంలో పేరుకున్న చెత్తాచెదారం.

● రంజాన్‌లో ముస్లిం సోదరులకు కష్టాలు

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం జనాభా నివశించే ప్రాంతాల్లోని మసీదుల వద్ద సకల సబ్బండు సౌకర్యాలు కల్పిస్తామని ఇటు జిల్లా యంత్రాంగంతోపాటు అటు జంట ఎమ్మెల్యేలు సమీక్షలు జరిపి మరీ ప్రకటించారు. కానీ వాస్తవంగా చూస్తే వీరు చేసిన సౌకర్యాలు ఏమీ లేవు. కార్పొరేషన్ అధికారులు ఈ సమీక్షలను పెద్దగా పట్టించుకొన్నట్లు లేదు. ముస్లింలు సహర్‌చేసి వేకువన 4.30, ఐదు గంటల మధ్య మసీదులకు నమాజుకు వెళ్తారు. కానీ ఈ సమయంలో ముస్లింలు ఎక్కువగా నివసించే డైకస్‌రోడ్డు, కోటమిట్ట, ఖుద్దూస్‌నగర్, మన్సూర్‌నగర్, పెద్దబజారు, జెండావీధి, వన్‌టౌన్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలేవీ చేపట్టడం లేదు. చిన్నబజారులో మాత్రం మసీదుల ముందు కాస్త సున్నం వేసి సరిపెడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి దేవుడెరుగు. చిన్నబజారు, పెద్దబజారు, జెండావీధి ప్రాంతాల్లో వీధిలైట్లు 75 శాతం వెలగడం లేదు. గత వారంలో పడిన చినుకులకు పేరుకపోయిన చెత్తాచెదారాలు, పొట్టపగిలి ప్రవహిస్తుండిన డ్రైనేజి నీళ్లు తొక్కుకొంటూనే ముస్లిం సోదరులు ప్రార్థనలకు తరలి వెళ్తున్నారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జరిగిన సమీక్షలో చౌక ధరల దుకాణాల ద్వారా ముస్లింలకు బియ్యం, గోధుమలు, చక్కెర, గ్యాస్ సరఫరా చేస్తామని ప్రకటించారు. ఇంతవరకు ఈ కోటాలు విడుదల చేసిన పాపాన పోలేదు. జంట ఎమ్మెల్యేలు వివేకానందరెడ్డి, శ్రీధర్‌కృష్ణారెడ్డిలు ఎసి సెంటర్‌లో ముస్లిం పెద్దలు, పేష్‌మాం, ఇమామ్‌లతో జరిపిన సమీక్షలో తాము ఎన్నికల కోడ్ దృష్ట్యా మసీదుల సందర్శనలకు రాలేకపోతున్నామని, కానీ ప్రాథమిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని ప్రకటించారు. కానీ నేటికి అవి ఏవీ అమలు కాలేదు. రంజాన్ మాసం మొదలయ్యి వారం కావస్తుంది. మరి చెప్పిన మాటలు చేసిన బాసలు నిలబెట్టుకోవాల్సిన బాధ్యత నేతలు, అధికారులకు లేదా?

మానవతకు ప్రతిరూపం ఎస్పీ రమణకుమార్!

● వీడ్కోలు సభలో పాత ఎస్పీని పొగిడిన కలెక్టర్



రమణకుమార్‌ను సన్మానిస్తున్న క్యాప్ విద్యార్థినులు.

నెల్లూరులో ఒకవైపు శాంతిభద్రతలు కాపాడుతూనే మరోవైపు అపూర్వ సేవా కార్యక్రమాలతో మన్ననలు పొందిన అధికారి ఎస్పీ బి.వి. రమణకుమార్ అని జిల్లా కలెక్టర్ నాగులపల్లి శ్రీకాంత్ చెప్పారు. నెల్లూరు ఎస్పీగా రెండేళ్లపాటు పనిచేసి ఇటీవల గుంటూరు అర్బన్ ఎస్పీగా బదలీ అయిన బి.వి.రమణకుమార్ వీడ్కోలు సభ 11వ తేదీ సిపిఆర్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రమణకుమార్ గూర్చి నేను ఎంతగానో తెలుసుకొన్నాను. శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తూనే క్యాప్ ద్వారా బోడిగాడితోటలోని అనాథ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడం మామూలు విషయం కాదు. ఆయన ప్రజావిజ్ఞప్తుల దినానికి ఇచ్చిన ప్రాముఖ్యత తననెంతో ముగ్దుడిని చేసిందన్నారు. కొత్త ఎస్పీ పివిఎస్ రామకృష్ణ మాట్లాడుతూ తాను రమణకుమార్ ఒకే బ్యాచ్‌కు చెందిన వారమన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన చేసిన పోస్టింగ్‌లలో తాను వస్తున్నానన్నారు. తామిద్దరం మంచి మిత్రులమని ఆయన ప్రారంభించిన ప్రజావిజ్ఞప్తుల దినాన్ని, క్యాప్ ప్రాజెక్టును తాను కొనసాగిస్తానన్నారు. సన్మానం అనంతరం ఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ రెండేళ్లు తాను విజయవంతంగా నెల్లూరులో పనిచేయడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెల్లించారు. జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం, న్యాయమూర్తులు జయచంద్రరావు, మధుసూదన్‌రావు, ఎఎస్పీ ఐఆర్ఎన్ మూర్తి, డిఎస్పీలు వెంకనాధ్‌రెడ్డి, బాల వెంకటేశ్వరరావు, ఇందిర, రాజమహేంద్ర నాయక్, చౌడేశ్వరి, సిఐలు వై.జయరామసుబ్బారెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి, ఎస్సీ రాజశేఖర్‌రెడ్డి, కోటారెడ్డి, కెవి రత్నం, మంగారావు, రామారావు పలువురు ఎస్ఐలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జనాభాను నియంత్రించాలి!

● ప్రజలకు జాయింట్ కలెక్టర్ పిలుపు

జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలను అర్థం చేసుకుని జనాభా నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం స్పష్టం చేశారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎబిఎం కాంపౌండ్ వద్ద ర్యాలీ ప్రారంభించిన ఆయన మాట్లాడారు. అత్యధిక జనాభా గల దేశాలలో భారతదేశం రెండవ స్థానంలో ఉందన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలంటే జనాభా పెరగకుండా తమ వంతు కృషి చేయాలన్నారు. ఎఎస్పీ ఐఆర్ఎన్ మూర్తి మాట్లాడుతూ జిల్లా జనాభా 30 లక్షలకు మించకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అనంతరం కుటుంబ నియంత్రణ పాటించిన యాకసిరి వైదేహి, బేగం, రూపేష్‌లకు పదివేల రూపాయల చొప్పున ప్రోత్సాహక బహుమతి అందించారు. సర్జన్లు డాక్టర్ ఎన్.పద్మ, పి.కోటేశ్వరరావు, హెచ్.మాల్యాద్రి, డాక్టర్ అమరేంద్రనాధ్ రెడ్డిలను సన్మానించారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎక్కువగా చేసిన డక్కిలి, కలువాయి, దొరవారిసత్రం విహెచ్‌సిల సిబ్బంది, స్టాఫ్ నర్సులు, ఆశ వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఈదూరు సుధాకర్, అడిషినల్ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పద్మావతి, డాక్టర్ జయసింహ, ప్రభుత్వాసుపత్రుల కో ఆర్డినేటర్ డాక్టర్ నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనులతో కదలని ట్రాఫిక్!



ట్రంకురోడ్డులో రోడ్డు విస్తరణ పనులకు తోలిన కంకర.

● ఇబ్బంది పడుతున్న నెల్లూరు జనం

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందం అయ్యింది నగరవాసుల పరిస్థితి. రోడ్ల విస్తరణలో భాగంగా కెవిఆర్ పెట్రోల్ బంకు వద్ద నుంచి మద్రాస్ బస్టాండ్ వరకు పడమరవైపున నిర్మాణ పనులు ప్రారంభించారు. సాధారణ రోజుల్లో అత్యంత రద్దీగా ఉండే రోడ్లు ఇవి. ఇరుకుగా వుండే ఈ రోడ్లలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. అలాంటిది రోడ్డుకు ఒకవైపున విస్తరణ పనులు ప్రారంభించడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు జిల్లా పోలీసు కార్యాలయం ముందు రోడ్డు వేస్తుండడంతో అటువైపు రాకపోకలు నిలిపేశారు. దీంతో అయ్యప్పగుడి నుంచి గాంధీబొమ్మ వైపు వచ్చే వాహనాలు మాగుంట లేఅవుట్ మీదుగా తిప్పుకొని రావాల్సి వస్తోంది. పొదలకూరు రోడ్డు నుంచి వచ్చే వాహనాలు మూలాపేట మీదుగా రావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఆర్టీసి బస్సులు ఇతర వాహనాలను రోడ్డుకు ఇవతలి వైపు ఆర్టీసి బస్టాండ్‌లోకి పోవడానికి అనుమతివ్వడంతో వాహనాలు ఒకే మార్గంలో రాకపోకలు సాగిస్తుండడంతో పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. పోలీసులు, మునిసిపల్ అధికారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురుకాకుండా చూడడంలో వైఫల్యం చెందడంతో నగర వాసులతోపాటు వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వచ్చే వారికి నరకం కన్పిస్తోంది.

ప్రైవేటు ప్రచారానికి అధికారుల ఫోటోలు! తప్పిది

జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల ప్రచారానికి అధికారుల ఫోటోలు బాగా ఉపయోగపడుతున్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులు అధిక మార్కులు సాధించారంటూ సన్మానాలు జరుపుతుంటారు. ఈ సన్మాన కార్యక్రమాలకు విద్యాశాఖ, విక్రమ సింహపురి యూనివర్శిటీ, ఇతర అధికారులు ముఖ్య అతిథులుగా హాజరౌతున్నారు. వీరిచేత విద్యార్థులకు బహుమతులు అందించి ఆ ఫోటోలతో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటుచేసి ప్రచారం చేస్తున్నారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో యూనివర్శిటీ, విద్యాశాఖ అధికారులు విద్యార్థులను అభినందిస్తున్నట్లు ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఫ్లెక్సీల్లో కనిపిస్తుండడంతో తమ పిల్లలను ఆయా కళాశాలలు, పాఠశాలల్లో చేర్పించేందుకు నిర్ణయించుకుంటున్నారు. ప్రవేశం పొందే సమయంలో వివిధ రకాల ఫీజుల పేర్లతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల గురించి ప్రస్తావించని అధికారులు ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఉత్సాహం చూపుతుండడం బాధాకరం.

టెలిగ్రామ్‌కు స్వస్తి!

● గత చరిత్ర ఎంతో ఘనం

టెలిగ్రామ్... ఈ పిలుపు ఇక వినపడదు. దీని గురించి ఈ తరం వారికి పెద్దగా తెలియకపోయినా పాత తరం వారికి ఈ పిలుపు, దాంతోపాటు వచ్చే సందేశాలు సుపరిచితం. సాంకేతికంగా అభివృద్ధి చెందని రోజుల్లో ఒక చోట నుంచి మరో చోటకు సమాచారాన్ని స్వల్ప వ్యవధిలో చేరవేసే సాధనం టెలిగ్రామ్. పోస్ట్‌మ్యాన్ ఇంటి ముందు నిలబడి పోస్ట్ అన్నట్లుగా టెలిగ్రాఫ్ కార్యాలయ సిబ్బంది టెలిగ్రామ్ అని పిలిచే పిలుపు ఒక రకంగా ఆందోళనకు గురిచేసేది. ఆ టెలిగ్రామ్‌లో ఏం వుందో, శుభ సమాచారం వుందా? ఏదైనా అశుభ వార్తను అది తీసుకు వచ్చిందా అని గుండెలు దడదడలాడేవి. మరణ వార్తలు, డబ్బు అవసరమైతే పంపమనే సందేశాలు, ఉద్యోగానికి ఇంటర్వ్యూకు రమ్మని వచ్చే కబుర్లు, వివాహ, పుట్టిన రోజు శుభాకాంక్షలు ఇలా ఎన్నింటినో తీసుకొచ్చేది టెలిగ్రామ్. టెలిగ్రామ్ ఇవ్వాలంటే టెలిగ్రాఫ్ కార్యాలయానికి వెళ్లి క్యూలో నిలబడి దరఖాస్తు ఫారం నింపి చెప్పదలచుకున్న సమాచారం దాని మీద వ్రాసి, లేదా నెంబర్ వ్రాసినా సిబ్బంది సమాచారం పంపేవాళ్లు. అలాంటి టెలిగ్రామ్ తనకుతానే మరణ సందేశాన్ని, చివరి సందేశాన్ని ప్రపంచానికి అందించింది. సాంకేతికంగా వచ్చిన అభివృద్ధి, సెల్‌ఫోన్ ప్రభావంతో టెలిగ్రాములు పంపేవారే లేకుండా పోవడంతో ఆ వ్యవస్థను జులై 15 నుంచి ప్రభుత్వం రద్దు చేసేసింది.

సౌత్ ఆములూరులో ద్విముఖపోటీ

తోటపల్లి గూడూరు మండలం సౌత్ ఆములూరు పంచాయితీలో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోగల ఈ పంచాయతీ మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోట. కమ్మ సామాజిక వర్గం అధికంగా వుండే ఈ గ్రామంలో అధికశాతం ఓటర్లు తెలుగుదేశం పార్టీ వైపే మొగ్గుచూపుతుంటారు. పలు శాసనసభ ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి సౌత్ ఆములూరు మెజార్టీ తెచ్చి పెట్టింది. అలాంటి పంచాయతీలో గత 27ఏళ్లుగా ఏనాడు సర్పంచ్ పదవికి ఎన్నికలు జరగలేదు. ఏక గ్రీవంగానే సర్పంచ్‌ను ఎన్నుకొంటూ వస్తున్నారు. అలాంటిది ఈసారి పోటీ నెలకొనింది. చాన్నాళ్లుగా ఒకరిద్దరే గ్రామ పెత్తనం చెలాయిస్తున్నారన్న అసంతృప్తితో వున్న అదే సామాజిక వర్గం వారు ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి వచ్చిన సందర్భంగా ఆ పార్టీ జెండా భుజాన వేసుకోవడంతోపాటు పోటీకి నిలబడ్డారు. ఓసి మహిళకు రిజర్వు చేసిన ఈ స్థానం నుంచి వైసిపి తరుపున చెరుకూరి శ్రీనివాసులు భార్య సరళ బరిలో నిలువగా, టిడిపి తరపున గుడ్లూరు గోపాల్ సతీమణి పద్మ, కాంగ్రెస్‌పార్టీ బలపరచే అభ్యర్థిగా సుధాకర్ భార్య శారద నామినేషన్ వేశారు. చివరి నిముషంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని పోటీ నుంచి

27 ఏళ్ల తర్వాత సర్పంచ్ పదవికి ఎన్నికలు

తప్పుకొని టిడిపికి సహకారం అందిస్తుండడంతో పోటీ టిడిపి, వైకాపా మధ్యే వుంది. టిడిపి విజయం సాధించేందుకు ప్రయత్నిస్తుండగా, వైపిసి సైతం ఎలాగైనా ఈ ఎన్నికల్లో నెగ్గేందుకు తమవంతు ప్రయత్నం చేస్తున్నారు. వీరికి ఇతర సామాజిక వర్గం వారు అండదండలు అందిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద మారిన రాజకీయలతో ఏకగ్రీవ చరిత్ర కల్గిన సౌత్‌ఆములూరులోనూ ఎన్నికలు తప్పలేదు.

మిస్టరీగా గూడూరు మిర్చి వ్యాపారి హత్య!

అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్న పోలీసు

గూడూరు పట్టణంలో మిర్చి వ్యాపారి దుగ్గిశెట్టి కృష్ణయ్య హత్య కలకలం రేపింది. స్థానిక బజారు వీధిలో నివసించే ఆయనకు మంచిపేరు వుంది. ఇటీవల సొంతింట్లో వుండగా ఇల్లు అద్దెకు కావాలని వచ్చిన ఇరువురు వ్యక్తులకు ఇల్లు చూపించేందుకు వెళ్లిన కృష్ణయ్య మృతి చెంది వుండడం కలకలం రేపింది. భార్య జయమ్మ ఎంతసేపటికి భర్త రాక పోవడంతో ఇంటి వెనుక పోర్షన్‌కు వెళ్లిచూడగా రక్తపుమడుగులో వున్న కృష్ణయ్య కన్పించడంతో కేకలు పెట్టింది. ఈ వార్త పట్టణంలో సంచలనం కల్గించింది. పట్టపగలు హత్య జరగడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ హత్యపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వడ్డీ వ్యాపారం చేసే అలవాటున్న కృష్ణయ్యకు ఆ లావాదేవిల్లో జరిగిన హత్య అనే కోణంలోను విచారిస్తున్నారు. ఆ ప్రాంతంలో వుండే ఆటో నడిపే వ్యక్తి తెలిపిన వివరాల ప్రకారం ఇరువురు వ్యక్తులు చిల్లకూరు బైపాస్ వరకు వదలమని చెప్పి ఆ తర్వాత మనుబోలు వరకు వదిలిపెట్టమని చెప్పి ఇవ్వాల్సిన దానికంటే అధికంగా డబ్బు చెల్లించారని, ఆ నోట్లపై రక్తపు మరకలు వుండడం, హత్య వార్త కలకలం రేపడంతో పోలీసుల వద్దకు వచ్చి వివరాలు తెలిపారు. అయితే పోలీసు జాగిలం తిరిగిన ప్రాంతం, ఆటో వాలా తెలిపిన వివరాలకు పొంతన లేకపోవడంతో పోలీసులకు సవాల్‌గా మారింది. దీన్ని ఎలా చేదిస్తారో చూడాలి.

మిల్లుల సీజ్‌లోనూ రాజకీయం!

కావలిలో అధికారుల బరితెగింపు

బకాయి పేరిట రైసుమిల్లును సీజ్ చేయడంలో రాజకీయాలు చోటుచేసుకోవడంతో కావలి పట్టణంలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణ పరిధిలోని పలు రైసు మిల్లులు లక్షలాది రూపాయలు బాకీ పడి వున్నాయి. ఇలాంటి రైసుమిల్లులుపై బ్యాంక్ అధికారులు, రెవెన్యూశాఖ ఎలాంటి చర్యలు చేపట్టకుండా పాతూరులోని సీతాలక్ష్మి మోడరన్ రైస్‌మిల్లును సీజ్ చేయడం ఈ విమర్శలకు కారణమయ్యింది. ఈ మిల్లు యజమాని రామిరెడ్డి కృష్ణారెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చెలామణి అవుతున్నాడు. స్థానిక పార్టీ నేతలతో పాసగక వేరు కుంపటి పెట్టుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. గతంలో లక్ష్మీపార్వతి ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొంది వున్నాడు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మలిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డితో కలసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. కావలి విద్యుత్ శాఖ అవినీతిపై ఆందోళన జరిపివున్నాడు. అలాంటి వ్యక్తికి సంబంధించిన మిల్లును సీజ్ చేయడం పై రాజకీయ ఒత్తిళ్లే కారణమని ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి.

● దగదర్తి జడ్పీ హైస్కూల్‌లో

మంచినీటికి కటకట!

రాజీవ్ విద్యామిషన్ ద్వారా మంచినీటి ఏర్పాట్లు పాఠశాలల్లో చేస్తున్నా అవి నిరుపయోగంగా మారుతుండడంతో పలు ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులు మంచినీటి కోసం అగచాట్లు పడాల్సి వస్తోంది. మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్నా మంచినీరు దొరక్క గొంతు తడుపుకొనేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. దగదర్తి జిల్లా పరిషత్ పాఠశాలను అక్కడి విద్యార్థులను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఇక్కడ బోరు ఏర్పాటు చేసినప్పటికీ సరిగా నీరు అందకపోతుండడంతో మధ్యాహ్న భోజనానికి వచ్చే విద్యార్థులు అసౌకర్యానికి గురౌతున్నారు. దీనిపై పలుమార్లు విద్యాశాఖ, మండల అభివృద్ధి అధికారులకు విన్నవించామని, పిల్లల ఇబ్బందులను దృష్టిలో వుంచుకొని అదనపు బోరు వేసి మంచినీటి ఇబ్బందులు తొలగించాలని పిల్లల తల్లిదండ్రులు కోరుకొంటున్నారు.

● విద్యార్థులకు

పుస్తకాల పంపిణీ

మంచి పనిచేసిన శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి

చిన్ననాటి నుంచే మంచి నడవడిక అలవరచుకోవడంతోపాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని విఆర్ కళాశాల పిజి సెంటర్ తెలుగు అధ్యాపకుడు, శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి కార్యదర్శి బత్తెన సాయికుమార్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఇందుకూరుపేట మండలం నిడిముసలి గ్రామంలో శ్రీరామకృష్ణ వివేకానంద భావప్రచార సమితి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహిస్తున్న విధంగానే ఈ సంవత్సరం ఒకటి నుంచి ఏడవ తరగతి చదువుతున్న పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యాన్ని పలకడం, తల్లిదండ్రులను పూజించటం, గురువులను గౌరవించడం అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కోశాధికారి ఉడతా శ్రీనివాసులు, విఆర్‌సి లెక్చరర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, గురునాథం, సాయికుమార్, కృష్ణ, గ్రామపెద్దలు నేదురుమల్లి రవికుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అందుబాటులో

జీలగ విత్తనాలు

వ్యవసాయాధికారుల ప్రకటన

వెంకటాచలం మండలంలోని రైతాంగానికి జీలగలు కొరత ఏర్పడకుండా అన్ని చర్యలు చేపట్టామని వ్యవసాయ శాఖ ప్రకటించింది. మండలానికి మొదటి దఫాగా వచ్చిన 666 బస్తాల జీలగలను చౌటపాళెం వ్యవసాయ పరపతి సంఘం గోడౌన్లో నిల్వచేశారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏఓ ఇవి.రమణ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుగా వినియోగించే జీలుగ పంటను ప్రోత్సహించేందుకు 50శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతి ఏడాది వ్యవసాయశాఖ విత్తనాలను సరఫరా చేస్తున్నాదన్నారు. ఈ విత్తనాలు అవసరమైన వారు పట్టాదారు పాసుపుస్తకాలతో తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆదర్శ రైతులు ఈ విషయాన్ని మండలంలోని అన్ని గ్రామాల రైతులకు తెలపాలన్నారు.

కలువాయిలో రంజుగా రాజకీయం!

పోటీలో వైకాపా నేతల భార్యలు

కలువాయి పంచాయతీలో సర్పంచ్ పదవికి పోటీ నెలకొనింది. ఇక్కడ తెలుగుదేశం, కాంగ్రెస్, వైసిపిలు కీలకంగా వ్యవహరిస్తున్నప్పటికీ సర్పంచ్ ఎన్నికలలో మాత్రం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలోని రెండు గ్రూపుల మధ్య పోటీ నెలకొనింది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన చల్లా , మేకపాటి వాణిశ్రీ పోటీ పడుతున్నారు. వీరిరువురు వైకాపా నేతల భార్యలు కావడం విశేషం. వీరిరువురు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అనూహ్యంగా స్థానిక న్యాయవాది యడ్ల స్వరాజ్యలక్ష్మి సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేయడం కలకలం రేపింది. బలిజ సామాజిక వర్గానికి చెందిన మహిళ కావడం, ఆ ఓటర్లు అధిక సంఖ్యలో వుండడంతో ఎన్నికలు రసవత్తంగా మారాయి. వైకాపా నుంచి నువ్వా నేనా అన్నట్లుగా పోటీలో వున్న అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థి రంగప్రవేశంతో ఖంగుతిన్నారు. కలువాయి సర్పంచ్‌గా గతంలో పనిచేసిన దివంగత యడ్ల రామయ్య కుటుంబానికి చెందిన ఆమెను పోటీ నుంచి విరమింపచేసేందుకు ఇరువర్గాల నేతలు పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద ఈ వ్యవహారం రంజుగా మారింది.



నెల్లూరు గాంధీబొమ్మ వద్ద గల సాయిబాబా మందిరం.

షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవములు

నెల్లూరు ట్రంకురోడ్డులోని షిర్డి సాయిబాబా మందిరంలో ప్రతి సంవత్సరంలాగానే ఈ ఏడాది కూడా గురుపూర్ణిమ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 22వ తేది నుంచి ఉత్సవాలు మొదలై 31వ తేది వరకు జరుగుతాయి. 22వ తేది నుండి 26వ తేది వరకు ప్రతిరోజు ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు జరుగుతాయి. 27వ తేది సాయంత్రం కన్నుల పండుగగా బాబా నగరోత్సవం, ప్రతిరోజూ సాయంత్రం సెంట్రల్ బ్యాంకు ఆవరణలో ప్రఖ్యాత ఉపన్యాసకులు మైలవరపు శ్రీనివాసరావుచే మహాభారతంలోని ఆదిపర్వం అంతరార్థంపై ఉపన్యాస కార్యక్రమం జరుగుతుంది. 31వ తేది మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం వుంటుంది. పై ఉత్సవాలలో భక్తులందరూ పాల్గొని బాబావారి తీర్థ ప్రసాదములు స్వీకరించి ఆయన కృపకు పాత్రులవ్వాలని సాయిబాబా మందిరం చైర్మన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి కోరుతున్నారు.



గ్రామీణ ప్రజల మధుమేహ ఆరోగ్య అవగాహన కోసం ఎన్‌సిడి జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ రూపొందించిన గ్రాఫిక్ లఘు చిత్రం సిడిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీకాంత్. ప్రక్కన జెసి లక్ష్మీకాంతం, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జి.సుధాకర్.

తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యం!



కావలిలో బీద మస్తాన్‌రావు

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కావలి శాసన సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం పాలన సాగించిన కాలం కంటే తెలుగుదేశం ప్రభుత్వం పాలనలోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందని వివరించారు. కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ఇక అవినీతితో సంపాదించిన డబ్బుతో ఏర్పడిన పార్టీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ అని విమర్శించారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లోఈ రెండు పార్టీలు శంకరగిరి మాన్యాలు పట్టడం ఖాయమన్నారు. కార్యకర్తలు కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్‌ల దోపిడీని ప్రజలకు వివరించాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో వ్యక్తిత్వం వున్న అభ్యర్థులను నిలబెట్టి పంచాయతీల అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఇప్పటికే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగక అభివృద్ధి కుంటుపడిందన్నారు. తిరిగి తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడం తథ్యమని మళ్లీ గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశంపార్టీ నేతలు తటపర్తి వాసు, ఆత్మకూరి బ్రహ్మయ్య, పాలడగు వెంకట్రావు, నాయుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరుకు

నీటిని తరలిస్తే ఊరుకోం!

వెంకటగిరి ఎమ్మెల్యే హెచ్చరిక.



కండలేరు నుంచి చిత్తూరు జిల్లాకు పైపులైన్ ద్వారా నీటిని తరలించాలని చూస్తే ఊరుకోమని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. జిల్లావాసుల నోరు కొట్టి సొంత జిల్లాకు అక్రమంగా నీటిని తీసుకొని పోయేందుకు ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ఇందులో భాగంగానే కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి జిల్లా మంత్రి రామనారాయణరెడ్డి సహకరించడం సిగ్గుచేటన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని తెలిపారు. కండలేరు జలాశయంలో 60టిఎంసిల నీరు నిల్వ వుండాల్సి వుండగా ప్రస్తుతం 40 టిఎంసిలు మాత్రమే వున్నాయని, డెడ్‌స్టోరేజి నీటిని తరలించుకొని పోయేందుకు ముఖ్యమంత్రి చూడడం దుర్మార్గ చర్య అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత చేవూరి విజయమోహన్‌రెడ్డి విమర్శించారు. అనంతరం పంచాయతీ ఎన్నికలపై కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశంపార్టీ ఉపాధ్యక్షుడు చెలికం శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు నేతృత్వంలో జరిగిన షుగర్ వ్యాధి ఉచిత చికిత్సా శిబిరంలో లయన్ జైస్ డ్రిస్టిక్ట్ గవర్నర్ అమృతవల్లి, లయన్ యడ్లవల్లి సురేష్, డాక్టర్ బివిఎస్.రవిశంకర్, పి.ఆంజనేయులు, పి.శ్రీనివాసులు, మురళీకృష్ణ.

దగదర్తిలో క్షీణించిన పారిశుధ్యం!

దగదర్తి మండలంలో పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడ చూసినా పేరుకపోయిన చెత్త, మురుగునీరు పొంగి పొర్లుతూ పరమరోతగా మారాయి గ్రామాలు. సక్రమంగా చెత్తను ఎత్తకపోవడం, పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టకపోవడంతో దగదర్తి మండలం సుందరముదనష్టంగా మారింది. పంచాయితీలకు సర్పంచ్‌లు లేకపోవడం, కార్యదర్శులు వున్నా వీటి బాగోగులు పట్టించుకోకపోవడంతో ఎవరికీ పట్టని అనాధలుగా మారుతున్నాయి గ్రామాలు. మండల పరిధిలోని దామవరం, దుండిగం, చవటపుత్తేడు, కాట్రాయపాడు, రంగసముద్రం, రామకృష్ణాపురం, మనుబోలు పాడు తదితర ప్రాంతాల్లో ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితులే నెలకొనివున్నాయి. వర్షాకాలంలో పరిస్థితి మరింత గందరగోళంగా మారుతోంది. కాలువలు పూడిపోయి మురుగునీరు పోయే మార్గంలేక రోడ్లపై పారుతుండడంతో, వాటికి వర్షపునీరు తోడవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్య సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేనేత కళలపై పుస్తకం

చేనేత చీరలు తయారు చేస్తున్న వివిధ కళలపై పుస్తకాన్ని ప్రచురించనున్నట్లు పద్మభూషణ్ అవార్డు గ్రహీత పరిశోధకురాలు స్వర్ణకుమారి తెలిపారు. వెంకటగిరి పట్టణానికి వచ్చిన ఆమె బంగారుపేట, సాలెపేట, ఐఐహెచ్‌టిని సందర్శించి చీరల తయారీ గురించి, పరిశ్రమ నిర్వహణ గురించి తెలుసుకొని అక్కడి వారితో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత చీరలపై వస్తున్న వివిధ రకాల డిజైన్లను పరిశీలన జరుపుతున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల ప్రతిభ, వారు ఈ రంగంలో ఎదుర్కొంటున్న కష్టానష్టాలు, కళలపై ఒక పుస్తకాన్ని తీసుకవచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఆమెతోపాటు ఆప్కో డైరెక్టర్ చెంచలరావు ఈ పరిశీలనలో పాల్గొన్నారు.



ఇష్టానుసారంగా

గ్రావెల్ త్రవ్వకాలు!

అడిగేవారెవరు?

జిల్లాలో గ్రావెల్ త్రవ్వకాల్లో నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో పలు ప్రాంతాల్లో అక్రమాలు చోటు చేసుకొంటున్నాయి. అనుమతి పొందిన ప్రాంతంలో కాకుండా చుట్టుప్రక్కల ప్రాంతాల్లోనూ త్రవ్వేస్తుండడంతో చాలాచోట్ల స్థానికులు, గ్రావెల్ త్రవ్వకందార్లకు గొడవలు జరుగుతున్నాయి. దగదర్తి మండలం కొరుగుంట గ్రామంలో ఎడా పెడా అక్రమంగా త్రవ్వేస్తుండడంతో గ్రామస్తులు అడ్డుకొన్నారు. రైల్వేట్రాక్‌ను ఆనుకొని ఇష్టానుసారంగా గ్రావెల్ త్రవ్వేయడం వలన ట్రాక్‌కు ప్రమాదం ఏర్పడే పరిస్థితి నెలకొనిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకసారి అడ్డుకొన్నప్పటికీ నిర్వాహకులు తిరిగి త్రవ్వకాలు జరపడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావును కలసి ఫిర్యాదు చేశారు. అలాగే అల్లూరు మండలం నార్త్‌ఆములూరు, గొల్లపాళెం ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. ఈ గ్రామాల్లో ఆరెకరాల విస్తీర్ణంలో మాత్రమే గ్రావెల్ త్రవ్వకాలకు అనుమతి వుండగా చుట్టుప్రక్కలా త్రవ్వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువుకు ఆనుకొని వరదనీరు వచ్చే కాలువ వుందని, సమీపంలో ఈ త్రవ్వకాలు జరపడం వల్ల వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులు పరిశీలించి అక్రమ త్రవ్వకాలను నిలిపివేయాలని కోరుకొంటున్నారు.

ఆ తొమ్మిది పంచాయితీలకు ఎన్నికలు లేవు!

వెంకటగిరిలోని తొమ్మిది పంచాయితీలకు ఎన్నికలు లేకుండాపోయాయి. ఈ పంచాయితీలను ఇటీవల మున్సిపాల్టీలో విలీనం చేయడంతో ఈ ఎన్నికల జంజాటం లేకుండా పోయింది. మండలపరిధిలో మొత్తం 20 పంచాయితీలు వుండగా అందులో లాలాపేట, చింతగుంట, జంగాలపల్లి, పెట్లూరు, వల్లివేడు, కంపాడు, మొగళ్లగుంట, చెలికంపాడు, కుర్జాగుంట పంచాయితీలను మున్సిపాల్టీలో కలిపారు. దీంతో ఇవి పంచాయితీ ఎన్నికల పరిధిలోకి రావని, మిగతా 11పంచాయితీల్లో మాత్రమే ఎన్నికలు జరుగుతాయని ఎంపిడిఓ తెలిపారు. అయితే వెంకటగిరిని ఆనుకొని పడమరవైపు వుండే సోమసానిగుంట పంచాయితీని మున్సిపాల్టీలో విలీనం చేయకపోడం చర్చనీయాంశమయ్యింది.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు!

వెంకటాచలం అంతా ఇంతే!



వెంకటాచలం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా మారాయి. తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసి వుండే వీటికి ఎలాంటి కంచె లేకపోవడంతో చిన్నపిల్లలు తిరిగే సమయాల్లో ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు స్థానికులు. పశువులు సైతం ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్దకు వెళ్లి మృత్యువాత పడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటుచేసిన దిమ్మెలు శిథిలమై ఏక్షణమైనా కూలిపోయే పరిస్థితుల్లో వున్నాయి. చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. వెంకటాచలం మసీదు ప్రక్కనే గల ట్రాన్స్‌ఫార్మర్ ఇలాగే ప్రమాద స్థితిలో వుంది. కాకర్లవారిపాళెంలో ఏర్పాటు చేసి వుండే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెలేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కాలనీ వాసులు హడలిపోతున్నారు. కసుమూరులో పీర్లచావిడి వద్ద వున్న ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఇలాగే కూలిపోయే పరిస్థితిలో వున్న పట్టించుకొనేవారే లేకుండా పోయారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో వుంచుకొనైనా విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరుకొంటున్నారు.

హాస్టళ్లలో మెనూ పాటించాలి!

వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు టిఫిన్ పెట్టాలని ఎస్సీ కార్పొరేషన్ ఇడి సోమయ్య సిబ్బందికి సూచించారు. ఆయన ఇటీవల తోటపల్లిగూడూరు మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాత్రి మిగిలిన అన్నాన్ని ఉదయం పులిహోరగా చేసి పెట్టడాన్ని గమనించిన ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి పరిస్థితుల్లోను మిగిలిన అన్నాన్ని ప్రక్కరోజు టిఫిన్‌కు పెట్టరాదని హెచ్చరించారు. హాస్టల్ నిర్వహణపై విద్యార్థుల నుంచి వివరాలు రాబట్టారు. సంక్షేమ వసతి గృహాలకు అత్యధిక బడ్జెట్ కేటాయించి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నాదని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు!



అనుమసముద్రంపేటలో జిల్లా కలెక్టర్ హెచ్చరిక

నిధులను దుర్వినియోగం చేసినా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు చేపడుతామని జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ హెచ్చరించారు. ఇందిర జల ప్రభ పథకం క్రింద చేపట్టిన పనులను పరిశీలించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటించారు. అనుమసముద్రంపేట మండలంలో 65లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ఇందిర జలప్రభ పథకం తీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు తమకు నాసిరకం మామిడి మొక్కలను పంపిణీ చేశారని దానివల్ల మామిడిసాగు సరిగా రాలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మామిడిచెట్ల సాగు సక్రమంగా ఎందుకు వుండడం లేదని అడగడంతో సమాధానం చెప్పేందుకు అధికారులు తంటాలు పడ్డారు. నాణ్యమైన మామిడి మొక్కలనే పంపిణీ చేశామని, అయితే భూమిలో ఐరన్ అధికంగా వుండడంతో మొక్కలు ఎదగడం లేదని తెలిపారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ఈ భూముల్లో మట్టిని విడివిడిగా పరీక్షలు చేయించి తనకు నివేదిక ఇవ్వాలన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల్లో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు.

సబ్‌ప్లాన్ సక్రమంగా అమలు చేయండి!

కావలిలో దళిత, గిరిజన ఐక్య వేదికల ధర్నాలు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘర్షణ సమితి, గిరిజన ఐక్యవేదిక సంయుక్తంగా కావలిలో ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాకు ముందు స్థానిక ఎబిఎం కాంపౌండ్ నుంచి ఎంపిడిఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు ఎస్.మల్లి, బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా అది సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. అధికారులు, బ్యాంకర్ల వైఖరి కారణంగా ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరగడం లేదని, అభివృద్ధికి నోచుకోక వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దీనిపై సమీక్షించి సంక్షేమ పథకాలను బ్యాంకుల ద్వారా కాక ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. అలాగే ఇందిరా క్రాంతి పథం సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవములు

తేది 22-07-2013 సోమవారం నుండి 31-07-2013 బుధవారం వరకు

తేది 22-07-2013 సోమవారం నుండి తేది 26-07-2013 శుక్రవారం వరకు ప్రతిరోజూ ఉదయం గం॥ 7.30 నుండి శ్రీ బాబావారికి మహాన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు మధ్యాహ్నం 12 గంటలకు సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును.

పై పూజా కార్యక్రమాలలో పాల్గొన దలచిన భక్తులు మందిర గుమాస్తా వద్ద 75/- రూపాయలు చెల్లించి పై పూజలలో పాల్గొని శ్రీ బాబావారి తీర్థ ప్రసాదములు స్వీకరించవల్సిందిగా కోరుచున్నాము.

గమనిక :- పై దినములలో ప్రతి రోజూ షిర్డి హారతులు జరుగును.

శ్రీ బాబావారికి నగరోత్సవం : తేది 27-07-2013 శనివారం సాయంత్రం 6 గంటలకు పుష్పాలంకరణ, మంగళ వాయిద్యములతో, విద్యుద్దీప కాంతులతో శ్రీ బాబావారి నగరోత్సవం జరుగును.

సాంస్కృతిక కార్యక్రమములు : తేది 22-07-2013 సోమవారం నుండి 30-07-2013 మంగళవారం వరకు ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుండి కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆవరణములో ప్రఖ్యాత ఉపన్యాసకులు, రామాయణ సుధామిని, భాషాప్రవీణ, వివిధ పత్రికలలో వ్యాసాలను అందిస్తున్నవారు, అనేక గ్రంథకర్తలు, తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలలో వ్యాఖ్యాత డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు ఎం.ఎ.,(తెలుగు), ఎం.ఎ.,(సంస్కృతం) పి.హెచ్.డి గారిచే మహాభారతంలో ఆదిపర్వం కథ - అంతరార్థంపై ఉపన్యాస మహాయజ్ఞము జరుగును.

అన్నదానము : తేది 31-07-2013 బుధవారం మధ్యాహ్నం 11 గంటలకు అన్నదానము జరుగును. అన్నదానమునకు భక్తులు తోచినవిధంగా వస్తురూపంలోగానీ, ద్రవ్యరూపంలోగానీ సహకరించి శ్రీసాయి కృపకు పాత్రులగుదురని కోరుచున్నాము.

పై కార్యక్రమములలో భక్తులందరూ పాల్గొని శ్రీ బాబావారిని దర్శించి, తీర్థ ప్రసాదములు స్వీకరించి బాబావారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము.

కార్యవర్గము

శ్రీ షిర్డిసాయిబాబా మందిరము

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్ : 0861-2327771



తొలి ఏకాదశితో...

పండుగలన్నీ తోసుకొస్తాయి!

ఆషాడ మాసంలో వచ్చే శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. ప్రతి నెలా రెండు ఏకాదశుల లెక్కన సంవత్సరానికి 24 ఏకాదశులు. అధిక మాసంతో కలిపి 26 ఏకాదశులు వస్తుంటాయి. వీటన్నింటిలో ఆషాడ శుద్ధ ఏకాదశిని ప్రథమ ఏకాదశి, మహా ఏకాదశి అని, తొలి ఏకాదశి అని పిలుస్తారు. దీనికి ఎంతో విశిష్టత వుంది. ఆషాడ మాసంలోనే ప్రత్యక్ష నారాయణుడు తన మార్గాన్ని దక్షిణాయనంలోనికి మార్చుకుంటాడు. దక్షిణాయనం ప్రారంభమైన తర్వాత వచ్చే ఏకాదశి కాబట్టి దీనిని తొలి ఏకాదశిగా ప్రజలు జరుపుకొంటారు. తొలి ఏకాదశి నుంచే పండుగలన్నీ తోసుకొని వస్తాయి అనే నానుడి వుంది. చాతుర్మాస వ్రత దీక్షా ఈనాటి నుంచే ఆరంభమవుతుంది.

పురాణాలననుసరించి విష్ణుమూర్తి క్షీర సాగరంలో శేషతల్పం మీద తొలి ఏకాదశి నుంచే నిద్రకు ఉపక్రమిస్తాడట. నాలుగు నెలలపాటు నిద్రించిన విష్ణుమూర్తి తిరిగి నాలుగు నెలల తర్వాత అక్టోబర్, నవంబర్ నెలలో వచ్చే ప్రభోదిని ఏకాదశినాడు మేల్కొంటాడని పురాణ కథనం. అందుకే ఈ నాలుగు నెలల్ని చాతుర్మాసాలు అని వ్రతం ఆచరిస్తారు. తొలి ఏకాదశి పండుగను గురించి బ్రహ్మవైవర్త పురాణంలో వివరించబడి వుంది. విష్ణువుకు ఎంతో ప్రీతికరమైన ఏకాదశి కాబట్టి ఆనాడు భక్తి శ్రద్ధలతో లక్ష్మీనారాయణులు ఇద్దరిని పూజిస్తారు. హరిశయనోత్సవం జరుపుకొంటారు. మహావిష్ణువు తొలి ఏకాదశి నుంచి పాతాళ లోకంలో బలి చక్రవర్తి ద్వారం దగ్గర వుండి కార్తీక శుద్ధ ఏకాదశికి తిరిగి వస్తాడని మరొక కథనం ప్రచారంలో వుంది. అందుకే ఈ పండుగకు హరిశయన ఏకాదశి అని, పద్మ ఏకాదశి అని కూడా పిలుస్తారు.

లోకపాలకుడైన విష్ణుమూర్తికి యోగ నిద్ర అనేది భూమిపై రాత్రి సమయాలు పెరుగుతాయి అన్న దానికి సూచన అని చెప్తారు. కృష్ణుడు, ధర్మరాజుకు ఈ ఏకాదశి మహోత్సం గురించి వివరించినట్లు భవిష్యోత్తర పురాణంలో చెప్పబడింది. సూర్యవంశపు రాజైన మాంధాత సత్యసంధుడు. ధర్మం తప్పనివాడిగా ప్రసిద్ధి. ఆయన రాజ్యంలో తీవ్ర కరవు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సయంలో అంగీరసుడు సూచనపై తొలి ఏకాదశి ప్రతాన్ని ఆచరించాడట. ఆ వ్రత మహత్యంతో కరవు తీరి ప్రజలు సుఖ సంతోషాలతో జీవించారని పురాణాలు చెప్తున్నాయి. పీఠాధిపతులు, ఆధ్యాత్మిక గురువులు ఆషాడ మాసం నుంచి నాలుగు నెలలపాటు ఎక్కడకు కదలకుండా ఒకే ప్రదేశంలో వుండి తమ శిష్యులకు అనుగ్రహభాషణ చేస్తారు. అందుకే ఈ దీక్షాకాలానికి చాతుర్మాస్య దీక్షగా వాడుకలోకి వచ్చింది. ఈ దీక్షాకాలం తొలి ఏకాదశితో ఆరంభమవతుంది. ఆనాడు మొక్కజొన్న పేలాలను పొడి చేసి, బెల్లం కలిపి విష్ణువుకు నైవేద్యంగా సమర్పిస్తారు.

సమరాంగణం

మేజర్ పంచాయతీల్లో హోరాహోరీ పోరు!

నామినేషన్లు, ఉపసంహరణల పర్వం పూర్తయ్యి గ్రామాల్లో ప్రచార పర్వం మొదలయ్యింది. వైఎస్సార్ కాంగ్రెస్ మద్దతుదారులు ఒంటరిగా పోటీ చేస్తుండగా, కాంగ్రెస్, తెలుగుదేశం ఉమ్మడి అభ్యర్థులు జిల్లాలో పలు చోట్ల పోటీకి దిగడంతో ఫలితాలపై ఆసక్తి నెలకొనింది.

గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీలు దగ్గర పడడంతో ప్రచారం హోరాహోరీగా కొనసాగుతోంది. జిల్లాలో 931 గ్రామ పంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో తొలివిడతగా నెల్లూరు డివిజన్‌లో ఈనెల 23వ తేది ఎన్నికలు నిర్వహిస్తారు. నామినేషన్ల పరిశీలన ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో సర్పంచ్ అభ్యర్థులతోపాటు వార్డు సభ్యులు సైతం ప్రచారం నిర్వహిస్తున్నారు. పోటీలో వున్న అభ్యర్థులకు ప్రధాన రాజకీయపార్టీలు మద్దతునిస్తున్నాయి. ప్రధానంగా మేజర్ పంచాయతీలను కైవసం చేసుకోవాలన్న గట్టి లక్ష్యంతో పార్టీలు పావులు కదుపుతున్నాయి. రాజకీయపరంగా కొన్ని విభేదాలున్నప్పటికి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వాటిని ప్రక్కనపెట్టి ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నాయి.

మేజర్ గ్రామ పంచాయతీలైన అల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఉదయగిరి, సీతారాంపురం, వరికుంటపాడు, వింజమూరు, ఇస్కపల్లి, కొడవలూరు, నార్తు రాజుపాళెం, ఇందుకూరుపేట, కోవూరు, వరిగొండ తదితర గ్రామాల్లో రాజకీయపార్టీల మధ్య గట్టిపోటీ ఏర్పడింది. కొన్ని పంచాయతీల్లో తెలుగుదేశం, కాంగ్రెస్, సిపిఎంలు ఒకే అభ్యర్థికి మద్దతు పలుకుతున్నాయి. ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్వతంత్రంగా ఎన్నికల బరిలో దిగి ఏ ఒక్కరి మద్దతు లేకుండా తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నిస్తుంది. నామినేషన్లకు ముందుగానే వైకాపా సర్పంచ్‌గా బరిలో నిలిచే వారిని ఎంపిక చేసుకుంది. ఇందుకు ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు కీలక బాధ్యతలను భుజాన వేసుకున్నారు. ఎస్సీలకు కేటాయించిన రిజర్వుడు స్థానాల్లో వైకాపా ఒంటరిగానే పోటీలో వుంది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారిని ఆయా గ్రామంలోని అగ్రవర్గాల వారు ఎంపిక చేస్తుంటారు. వారి సహకారం లేనిదే గెలుపొందటం కష్టతరంగా భావిస్తుంటారు.

అల్లూరు గ్రామ పంచాయతీకి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు మహిళలు నామినేషన్లు దాఖలు చేశారు. ఇక్కడ వైకాపా అభ్యర్థిని ముందుగానే ఎంపిక చేయగా చివరి క్షణంలో కాంగ్రెస్, టిడిపిలు తమ అభ్యర్థులను ఆఘమేఘాల మీద ఎంపిక చేసి నామినేషన్లు వేయించారు. మేజర్ పంచాయతీగా వున్న దీని పరిధిలో దాదాపు 15 మజరా గ్రామాలు విలీనమై వున్నాయి. తెలుగుదేశం, కాంగ్రెస్‌పార్టీలు ఎంపిక చేసిన అభ్యర్థులు రాజకీయాల పట్ల ఎటువంటి అవగాహన లేని వారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో వుండి మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కరేటి దైవాధీనం వైకాపా తీర్థం పుచ్చుకొన్నారు. ఈయన సతీమణిని సర్పంచ్ అభ్యర్థిగా పోటీకి నిలిపారు. అన్ని గ్రామాల ప్రజలకు సుపరిచితుడు కావడం వల్ల గెలుస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే రాజుపాళెం సర్పంచ్ అభ్యర్థిగా వైకాపా నాయకుడు, మాజీ జడ్పీటీసి వీరి చలపతి సతీమణి కలైవాణి ఎన్నికల బరిలో వున్నారు. గతంలో ఈమె ఇదే పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన విషయం అందరికి తెలిసిందే.

గత పంచాయితీ ఎన్నికల్లో రాజుపాళెం గ్రామ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వుకాగా ప్రస్తుతం బిసి మహిళకు కేటాయించారు. ఇక్కడ బిసి మహిళగా కలైవాణి నామినేషన్ దాఖలు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. గతంలో ఎస్సీ మహిళగా పోటీ చేసి, ఇప్పుడు బిసి మహిళగా నామినేషన్ వేయడం వివాదాస్పదంగా మారింది. కుల ధృవీకరణ పత్రంపై తర్జనభర్జన పడ్డ ఎన్నికల అధికారులు చివరకు ఆమోదించడంతో వివాదం సర్దుమణిగింది. టి.పి గూడూరు మండలం వరిగొండ పంచాయతీని ఎస్సీ మహిళకు కేటాయించడం జరిగింది. మొదటి నుండి ఇక్కడ ప్రతి పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, టిడిపి నేతలు సంయుక్తంగా అభ్యర్థిని ఎంపిక చేసేవారు. ఈ సంవత్సరం వైకాపా కూడా రంగంలోకి దిగడంతో త్రిముఖ పోటీ ఏర్పడింది. సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సుభాషిణి అనే మహిళను ఎంపిక చేయగా వరిగొండకు చెందిన నేతలు మరో ఎస్సీ మహిళను ఎంపిక చేశారు. సుదీర్ఘంగా చర్చించిన అనంతరం సుభాషిణిని ఖరారు చేయాల్సి వచ్చింది.

కాంగ్రెస్, టిడిపి నేతలు ఎంపిక చేసి అభ్యర్థులు కూడా పోటీలో వుండడంతో ఎవరికి వారు గెలుస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు వైకాపా వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. మేజర్ పంచాయతీలో నగదు, మద్యం సరఫరా చేసేందుకు నేతలు ప్రయత్నిస్తున్నారు. పోలీస్ తనిఖీలు ఉన్నప్పటికీ అడ్డదారుల్లో నగదు, మద్యం తరలి వెళ్లిపోయింది.

ఆర్థిక సంస్కరణలలో అగ్ర ఫలితం రిలయన్స్‌కే దక్కింది!

ఫలితాలు భారతీయులకు అందడం లేదు!

16వ పేజీ కొరవ

రిలయన్స్ దేశాన్ని మోసగించింది

ఈ దుర్గతికి కారణం – రిలయన్స్ కంపెనీ దేశాన్ని దారుణంగా మోసం చేయడం. గ్యాస్ బావుల త్రవ్వకాన్ని టెండర్ల ఆధారంగా అప్ప చెప్పారు. టెండర్ సమయంలోనే గ్యాస్ ధర నిర్ణయం జరిగింది. రిలయన్స్ టెండర్ వేసినప్పుడు ఒక ఎంఎంబిటియుకి 1.79 డాలర్లు మాత్రమే. ప్రతి ఐదేళ్లకొకసారి ఈ ధరను పెంచాలని టెండర్ షరతు. ఆ ప్రకారం 2009 నాటికి 4.2 డాలర్ల స్థాయికి చేరుకొన్నది. అయితే ఆ ధరలో గ్యాస్ సరఫరా చేయడానికి రిలయన్స్ ఇష్టపడలేదు. దానితో కావాలనే గ్యాస్ ఉత్పత్తి తగ్గించి వేసింది. 2014లో ధరల పెంపు జరుగుతుంది కాబట్టి అప్పటివరకు ఉత్పత్తి నిలిపి వేయాలనే దుర్మార్గపు ఆలోచన చేసింది. అది టెండర్ షరతులకు విరుద్ధం. అయితే మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కళ్లు మూసుకొని వుండిపోయింది. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలో ఈ మోసాన్ని ప్రస్తావించినంత వరకు ఎవరికీ తెలియదు. టెండర్ షరతులకు విరుద్ధంగా ప్రవర్తించిన రిలయన్స్ కంపెనీకి భారీ జరిమానా విధించడంతో పాటు, వారికి కేటాయించిన బావులను జాతీయం చేయాలని సిఫార్సు చేశాడు కంట్రోలర్ జనరల్. ఆ నివేదిక వచ్చే నాటికి జైపాల్‌రెడ్డి పెట్రోలియం మంత్రిగా వున్నాడు. వివరాలన్నీ పరిశీలించిన తర్వాత ఆయన రిలయన్స్ మోసాన్ని నిర్ధారించి, 6వేల కోట్ల రూపాయల జరిమానా చెల్లించాలని ఆదేశించాడు. ఆయన ఆ ఉత్తర్వు జారీ చేయడం, ఆయన్ను పెట్రోలియం శాఖ నుంచి తప్పించి వేయడం వెంట వెంటనే జరిగిపోయాయి. కేంద్ర ప్రభుత్వం మీద రిలయన్స్ కంపెనీ పలుకుబడి ఆ స్థాయిలో వుంటుంది. అది కాంగ్రెస్ అయినా బిజెపి అయినా ఆ కంపెనీ గీచిన గీటు దాటవు.

రెట్టింపు ధర

జైపాల్‌రెడ్డి పక్కకు తప్పుకోగానే వీరప్ప మొయిలీ పెట్రోల్ మంత్రి అయ్యాడు. ఆయన వ్యక్తిగతగా నిజాయితీ పరుడన్న పేరున్న మాట నిజం. కానీ అధిష్టానం అడుగులకు మడుగులొత్తడం తప్ప స్వతంత్రంగా వ్యవహరించలేక పోవడం ఆయన బలహీనత. ఆ నిజం – రిలయన్స్ గ్యాస్ ధరను రెట్టింపు చేయడంలో నగ్నంగా బయట పడింది. టెండర్ షరతుల ప్రకారం ధర మార్పులు 2014లో జరగాలి. కానీ ఏడాది ముందుగానే ధర సమీక్ష చేపట్టారు. ప్రజల కళ్ల నీళ్లు తుడవడానికి మాజీ గవర్నర్ రంగరాజన్ నేతృత్వంలో ఒక కమిటీ నియమించారు. దాని సిఫార్సును సాకుగా చూపించి ఒకేసారి 4.2 డాలర్ల నుంచి 8.4 డాలర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకొన్నాడు వీరప్ప మొయిలీ. ఒక్కరోజు ఆలస్యం చేయకుండా ప్రధాన మంత్రి ఆ ధరను నిర్ధారిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపాడు.

ఉత్పత్తి ఖర్చు లెక్క ఏమిటి?

ఏ వస్తువుకైనా ధర నిర్ణయించేటప్పుడు ఉత్పత్తి ఖర్చు లెక్కలోకి తీసుకోవాలి. తయారు చేయడానికయ్యే ఖర్చుకు పెట్టిన పెట్టుబడి మీద కనీస రాబడిని జతకలిపి ధర నిర్ణయించాలి. కానీ రిలయన్స్ విషయంలో అది జరగలేదు. అంతర్జాతీయ గ్యాస్ ధరల ప్రాతిపదిక మీద కొత్త ధర నిర్ణయించారు. చాలా దారుణమైన పద్ధతి ఇది. ప్రపంచంలోని ఏ గ్యాస్ బావి వద్ద కూడా ఉత్పత్తిదారుడికి ఈ ధర దక్కడం లేదు. మార్కెట్లో మాత్రమే ఆ ధర వుంది. మార్కెట్ ధర అంటే ఎన్నో విషయాలు కలుస్తాయి. రవాణా, డిమాండ్ సప్లై పరిస్థితులు వంటివి మార్కెట్ ధరను ప్రభావం చేస్తాయి. రిలయన్స్ గ్యాస్ పూర్తిగా జాతి సంపద. అది వారి తాత సొత్తు కాదు. సముద్రం అడుగునుంచి తవ్వితీయడానికి మాత్రమే వారికి కాంట్రాక్ట్ ఇచ్చారు. దాని ప్రకారం తీయడానికయ్యే ఖర్చు లాభం కలిపి ఇవ్వాలి. ఈ ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి, రిలయన్స్‌కు జాతి సంపదను దోచి పెట్టడానికి సిద్ధపడుతున్నాడు మన్మోహన్‌సింగ్.

కరెంట్ వాడుకోలేము

ఈ కొత్త ధర చెల్లింపు జరిగితే గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలలో కరెంట్ ఉత్పత్తి ఖర్చు యూనిట్‌కు రెండు రూపాయలు పెరుగుతుంది. ఇప్పటికే భారతదేశంలో కరెంట్ ఛార్జీలు మోయలేని భారంగా వున్నాయి. చైనా వంటి దేశాలతో మన పారిశ్రామికులు పోటీ పడలేక పోవడానికి ప్రధాన కారణం – విపరీతమైన కరెంట్ ఛార్జీ. ఆ ఛార్జీలను మరొక రెండు రూపాయలు పెంచవలసి వస్తే దేశంలో ఎవరూ కరెంట్ వాడుకోలేరు. గ్యాస్ ఎక్కువగా వాడుకొనే మరొక రంగం ఎరువుల తయారీ. గ్యాస్‌కు ఈ కొత్త ధర చెల్లిస్తే ఒక్కొక్క యూరియా బస్తా ధర కనీసం వంద రూపాయలు పెంచవలసి వస్తుంది.

ఏడాదికి 50వేల కోట్ల భారం

ఈ రెండు రంగాలలో, రిలయన్స్‌కు వీరప్ప మొయిలీ కానుకగా ఇస్తున్న ధర వల్ల ఏడాదికి 50వేల కోట్ల రూపాయల భారం ప్రజల మీద పడనున్నదని అంచనా. సిపిఐ నేత గురుదాస్ గుప్తా అయితే ఈ అంచనా 70వేల కోట్ల వరకు వుంటుందని చెప్తున్నాడు. గ్యాస్ వల్ల పెరిగే కరెంట్ ఛార్జీలు, ఎరువుల ధరల వల్ల పడే భారం ఇది. ఈ లెక్క నిజమైతే ఆర్థిక సంస్కరణల పేరిట మన్మోహన్‌సింగ్ సర్కారు సృష్టించిన 2జి, బొగ్గు వంటి భారీ కుంభకోణాలకు ఎన్నో రెట్ల అధికమైన దోపిడీ ఇది. కొన్ని దశాబ్దాల పాటు భారత ప్రజానీకం రిలయన్స్ కంపెనీ లాభాల కోసం ఇంత మొత్తాన్ని తమ నెత్తి మీద మోయవలసి వస్తుంది.

ఇది ఎవడబ్బ సొత్తు?

కెజి బేసిన్ గ్యాస్ రిలయన్స్ కంపెనీ ఆస్తి కాదు. ఆ ప్రాంతంలో గ్యాస్ నిల్వలున్నట్లు ప్రభుత్వ అన్వేషణలో తేలడంతో, దాన్ని త్రవ్వి వెలికి తీయడానికి రిలయన్స్ కంపెనీకి కాంట్రాక్ట్ మాత్రమే ఇచ్చారు. లాభం అంటూ లేనిదే ఏ కాంట్రాక్టర్ కూడా పని చేయడు. కానీ ఆ లాభాలకు ఒక పరిమితి, పద్ధతి వుండాలి. రిలయన్స్ కంపెనీ టెండర్ వేసినప్పుడు ఇచ్చిన ఉత్పత్తి ఖర్చు అంచనా వేరు. అప్పటికి అది అంతర్జాతీయ స్థాయిలో గ్యాస్ బావుల ఖర్చుతో సమానంగా వుంది. కానీ ఒకసారి గ్యాస్ బయటపడగానే రిలయన్స్ దురాశ అమాంతం పెరిగిపోయింది. టెండర్ సమయంలో 40 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ వెలికి తీయడానికి 2.7 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని అంచనా సమర్పించింది రిలయన్స్. కానీ ఒకసారి గ్యాస్ బయల్పడగానే తనకు అదే మొత్తం గ్యాస్ తీయడానికి 8 బిలియన్ డాలర్లు ఖర్చు అయ్యిందని నివేదించింది. ఈ లెక్క ఎంత వరకు నిజమో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కనీసపాటి పరిశీలన కూడా చేయలేదు. టెండర్ షరతుల ప్రకారం ఉత్పత్తి ఖర్చు పూర్తిగా రాబట్టుకొన్న తర్వాత మాత్రమే రిలయన్స్ కంపెనీ గ్యాస్ ధరలలో ప్రభుత్వానికి వాటా ఇవ్వాలి. అందుకోసమే ఉత్పత్తి ఖర్చును మూడింతలు పెంచి చూపించారు. అంత ఖర్చు పెట్టాము కాబట్టి దానికి తగినట్లు ధర వుండాలని పట్టుబట్టి, ప్రభుత్వం మెడలు వంచి 8.4 డాలర్ల ధర నిర్ణయింప చేశారు.

బిజెపి నోరు మూగబోయింది

ప్రైవేట్ కంపెనీలు దేశాన్ని నిట్ట నిలువునా దోచుకొనే ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత బాధ్యత వుందో, ప్రతిపక్షమైన బిజెపికి అంతే వాటా వుంది. కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత బిల్లు ఆర్డినెన్స్ తెస్తే కొంపలు తగలబడిపోయినట్లు గోల చేస్తున్న బిజెపి నేతలు, రిలయన్స్‌కు ఇంత దుర్మార్గమైన ధర నిర్ణయం జరిపితే కిక్కురు మనడం లేదు. ఒక్క జాతీయ నేత కూడా దీనిపై అభ్యంతరం చెప్పలేదు. వారి నోరు మూగబోయింది. అందుకు కారణం – రిలయన్స్ కంపెనీతో వారికి వుండే అనుబంధం. అటు కాంగ్రెస్, ఇటు బిజెపి పార్టీల ఎన్నికల ఖర్చులో సింహ భాగం రిలయన్స్ నుంచి వచ్చే చందా అన్న నిజం ప్రతి రాజకీయ వాదికీ తెలుసు. రిలయన్స్ నుంచి ఈ రెండు పార్టీలూ వందలాది కోట్ల రూపాయల చందా తీసుకొంటాయి. అందువల్లనే ఆ కంపెనీ వ్యవహారం అంటే నోరు మెదపరు.

చతుర్థ వర్ధంతి



జననం : 07-02-1951

మరణం : 06-07-2009

మమతల మణిదీపం,
మా మనసుల్లో చెదరని రూపం

స్వర్గీయ జక్కా సౌదామిని గారు

శివ సాన్నిధ్యం పొంది
నాలుగేళ్ళు గడుస్తున్న సందర్భంగా...

ఆ పుణ్యమూర్తి దివ్యస్మృతిని స్మరిస్తూ...

తేది. 22-07-13(గురుపూర్ణిమ), సోమవారము
మనుబోలులోని మా ఆయిల్‌పామ్ తోట వద్ద
ఉదయం 11గంటల నుండి
సంస్మరణ కార్యక్రమం జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

జె.ఎస్.రెడ్డి (భర్త)
మరియు
కుటుంబసభ్యులు



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

రుణబాధలున్నప్పటికీ ఆర్థికంగా అభివృద్ధి వుంటుంది. శ్రమకు తగిన ఫలితం రాబడతారు. వృత్తి, వ్యాపారాలు అనుకూలిస్తాయి. శుభ కార్యాల నిమిత్తం నూతన వస్తు, వస్త్రప్రాప్తి. ఇంట్లో వేడుకలు, సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆరోగ్య సమస్యలో మెరుగు. శుభకార్యాల మూలంగా ధన వ్యయం. వ్యవసాయ పనులకు అనుకూలం. కళా, క్రీడాకారులకు ఆదాయ వృద్ధి. ఖర్చులు కూడా అధికమే.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

మిశ్రమ ఫలితాలుంటాయి. శరీరారోగ్య లోపాలు, స్నేహితులతో వైరం. నేత్రబాధ, అధిక ప్రయాణాలు, త్రిప్పట, కార్యభంగం తద్వారా ధన వ్యయం. మీ మాటకు విలువ పెరుగుతుంది. కుటుంబ సౌఖ్యం. శత్రువులు మిత్రులవుతారు. విద్యార్థులకు కాలేజీలలో సీట్లు సులభ సాధ్యమౌతుంది. వ్యవసాయ రంగం వారికి అదును కాలం. అంతా లాభమే. రాజకీయుల మాటకు విలువ వుంటుంది.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

గ్రహ చలనాల వ్యతిరేకత వల్ల శరీరారోగ్య లోపాలు. ప్రతి చిన్న విషయానికీ ఆందోళన, ఆదరణ, వైరాలు, బంధుపీడ, నిద్రలేమి వుంటాయి. ఉద్యోగులకు పనిభారం, అధికారుల ఒత్తిడి, కుటుంబ సభ్యుల మధ్య బేధాభిప్రాయాలుంటాయి. చేసే వృత్తి, వ్యాపారాలు సామాన్యం లేదా అనుకోని నష్టం. అన్ని రంగాల వారికి ఆదాయ భంగం. విద్యార్థులకు పర్వాలేదనిపిస్తుంది. వ్యవసాయదారులకు ఆర్థిక నిలకడ.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

గ్రహానుకూలతల వ్యతిరేకం వల్ల అన్ని రంగాలవారు అనేక సమస్య లెదుర్కోగలరు. ఆరోగ్య లేమి, మనోధైర్యం, పిరికితనం, ప్రతి చిన్న విషయానికీ ఆందోళన, ఊహించని సమస్యలు, కుటుంబ సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు, శత్రుభయం, స్త్రీ సౌఖ్యం తక్కువ. నూతన వ్యాపార ఆరంభం లేదా విస్తరణకు యోచనలు. ప్రయాణాలలో వివాదాలు, ఇతరులతో అనవసర ద్వేషం, విముఖతలుంటాయి.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

అపరిష్కృతంగా వున్న పనులు ముందుకు సాగుతాయి. నూతనోత్సాహం పొంది అన్ని పనులలో చురుకుగా పాల్గొంటారు. చేసే వృత్తి, వ్యాపారాలు రాణిస్తాయి. కుటుంబ సౌఖ్యం, సంతానాభివృద్ధి, ముఖ్యంగా ఆర్థికంగా మంచి మార్పులుంటాయి. విద్యార్థులు కోరుకొన్నచోట సీట్లు లభించి అనుకూలతలు సాధిస్తారు. వ్యవసాయదారులు పనులలో చురుకుగా పాల్గొంటారు.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

విద్యార్థులకు గతంలోకన్నా బాగుంటుంది. చేసే వృత్తి, వ్యాపారాలు బాగుంటాయి. ఆదాయం బాగున్నా దానికి తగ్గట్టు ఖర్చులుంటాయి. అవసరానికి రుణ సౌకర్యం లభిస్తుంది. ప్రయాణ సౌఖ్యం. వ్యవసాయదారుల అంచనాల మేరకు పనులు సాగుతాయి. కళా, క్రీడాకారులు పేరు ప్రతిష్టలతో సంఘంలో గౌరవింపబడతారు. రాజకీయులకు శత్రువులపై ఆధిక్యత, గౌరవ మర్యాద పెరుగుతాయి.

వారఫలాలు

తేది 20-7-2013 నుండి 26-7-2013 వరకు మేషంలో కేతువు; మిథునంలో కుజ, బుధ, గురులు; కర్కాటకంలో రవి; సింహంలో శుక్రుడు; తులలో శని, రాహువులు; వృశ్చిక, ధనుర్మకర, కుంభాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

20తేది శనిత్రయోదశి-ప్రదోషం. పుష్యమి కార్తె.
22తేది మాహాషాడి, గురు పూర్ణిమ, వ్యాసపూర్ణిమ.
25తేది సంకటహర చతుర్థశి.
26తేది ఆడి పదునెట్టు.

శుభ ముహూర్తాలు

ఆగష్టు 6తేది వరకు ఆషాడ మాసం శూన్యమాసం కనుక శుభ ముహూర్తాలు లేవు. అన్నప్రాసాది సామాన్య కార్యక్రమాలకు ముహూర్తాలున్నాయి.

జూలై తిథులు
ఆషాడ శుద్ధ

20	శని	ద్వాదశి	ప	10.47 గం.ల.వ
21	ఆది	త్రయోదశి	ఉ	07.14 గం.ల.వ
	తదుపరి	చతుర్దశి	తె	03.29 గం.ల.వ
22	సోమ	పౌర్ణమి	రా	11.44 గం.ల.వ

ఆషాడ బహుళ

23	మంగళ	పాడ్యమి	రా	08.07 గం.ల.వ
24	బుధ	విదియ	సా	04.50 గం.ల.వ
25	గురు	తదియ	ప	02.04 గం.ల.వ
26	శుక్ర	చవితి	ప	11.59 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు - 2. సెల్: 95819 76599.



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

గ్రహ సంచార మార్పులతో రాబోయే రోజులన్నీ అనుకూలిస్తాయి. వృత్తి, వ్యాపారాలలోని వారు ఆర్థిక బాటను పట్టగలరు. ఆదాయాలు బాగుంటాయి. నూతన వ్యాపారాలోచనలు కలసివస్తాయి. బంధుమిత్రుల సమాగం. ఆర్థికంగా నిలదొక్కుకొంటారు. స్పెక్యులేషన్‌లో నష్టాలు తప్పవు. స్త్రీ సౌఖ్యం, నూతన పరిచయాలు లాభిస్తాయి. విద్యార్థులు అనుకూలతలు సాధిస్తారు.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

మనఃశ్శాంతి తక్కువ. ఆరోగ్యం అంతంత మాత్రమే. తద్వారా చీకాకులు, గృహమార్పు లేదా స్థానమార్పులు తప్పవు. మనోదుఃఖం, దుష్టసాంగత్యం, రక్తసంబంధీకుల వల్ల సూతకాలు, చేసే ప్రయాణాలలో నష్టాలు, ప్రభుత్వ సంబంధ కార్యాలు నిలచిపోవడం. విద్యార్థులకు నూతన విద్యావకాశాలున్నా ప్రయాణాలలో అప్రమత్తత అవసరం. వ్యవసాయదారులకు శారీరక శ్రమ అధికం.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

కోపతాపాలు, ఆందోళనలు, హావభావాలు అదుపు చేయడం వల్ల జయం. శ్రమకు తగిన ఫలితముంటుంది. వ్యవహారాలలో వాక్పటిమ, సర్వత్రా అనుకూలతలు, బంధుమిత్ర సహాయసహకారాలు లభించి లాభిస్తాయి. అన్నీ రంగాల వారిని ఏదో ఒక సమస్య బాధిస్తుంది. స్నేహితుల మధ్య బేధాభిప్రాయాలేర్పడతాయి. విద్యార్థులు అనుకూలతలు సాధిస్తారు. వ్యవసాయదారులు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

వృత్తి, వ్యాపారాలు రాణిస్తాయి. అనుకున్నది సాధిస్తారు. ఆదాయం బాగుంటుంది. చేసే పనులు ఎంత క్లిష్టమైనవైనా సాధిస్తారు. విలాసాలకు అధికంగా ఖర్చు చేస్తారు. సంతాన సౌఖ్యం, స్పెక్యులేషన్ లాభిస్తుంది. కళత్ర సౌఖ్యం, దూర ప్రయాణాల వల్ల లాభాలు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధిస్తారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతాయి. రాజకీయులకు పలు సమస్యలు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

సంతృప్తికరమైన జీవనం లభిస్తుంది. మీ మాటకు విలువ పెరుగుతుంది. ఇతరులకు సహాయసహకారాలు అందిస్తారు. నూతన వస్తు, వాహన, వస్త్ర లాభాలు. గృహంలో మార్పులు. బంధుమిత్ర సమాగం. సంతాన, కుటుంబ, స్త్రీ సౌఖ్యాలుంటాయి. స్త్రీ సంబంధ విషయాలలో అతి పనికి రాదు, తద్వారా అనేక సమస్యలేర్పడతాయి. రియల్ ఎస్టేట్, ఇతర భూ సంబంధ వ్యాపారులకు అనుకూలం.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

వృత్తి, వ్యాపారాలు ఆశాజనకంగా వుంటాయి. అన్ని రంగాల వారికి అనుకూలతలుంటాయి. ఆదాయం పర్వాలేదు. ఖర్చులు కూడా తక్కువగా వుంటాయి. ఆరోగ్యం పర్వాలేదనిపిస్తుంది. బంధుమిత్రుల సహకారాలుంటాయి. సంతాన, కుటుంబ సౌఖ్యం, శత్రు జయం, ఆనందం. నూతన వ్యాపార ప్రారంభ ఆలోచనలు ముఖ్యం. దైవ కార్యాల పట్ల ఆటంకాలు. వ్యవసాయదారులకు రుణాలు లభిస్తాయి.

వాస్తు 'చతుశ్రేష్ఠ' గ్రంథ రాజాల రచన - విశ్లేషణ!

ఎన్.ఎం.సునీల్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్

** 15వ శతాబ్దంలో నాలుగు ప్రధాన వాస్తు గ్రంథాలు సుప్రసిద్ధమని తెలుగు యూనివర్శిటీలో చెప్పారు.*

క్రీశ 1510-1598 సంవత్సరాలలో వాస్తు రాజవల్లభం ప్రధమ గ్రంథం, ద్వితీయం ప్రాసాద మండన(రాజభవన), తృతీయం వాస్తు మండన, చతుర్థం కోదండ మండన, 'శిల్పరత్నం' ఈ శతాబ్దం తర్వాత వచ్చిన గ్రంథం.

ఎన్.శకుంతల సూళ్లూరుపేట

** నూతన దంపతులకు 'అరుంధతీ' నక్షత్రం చూపిస్తారు. అది అసలు కనిపిస్తుందా?*

కనిపించే సమయంలో కనిపిస్తుంది కదా? అది శాస్త్ర'సూక్తం'. పాటించడం మంచిది. అపహాస్యం చేయనక్కర లేదు.

వై.ఇందుమతీరెడ్డి చెన్నై

** అబ్బాయి చేయని వ్యాపారాలు లేవు. ఎందులోనూ స్థిరపడలేక పోతున్నాడు.*

అబ్బాయి జాతకాన్ని లెక్కించాక అతను పుష్యరాగ ధారణచేసి, 'లక్ష్మీకృత వాస్తుయంత్ర' పూజ మండలం రోజులు చేయడం మంచిదని మా అభిప్రాయం.

టి.శశికళ నాయుడుపేట

** అపార్టుమెంటు ప్లాట్లలో వాస్తు ఉండటం లేదు. పరిష్కారం ఏమిటి?*

అపార్టుమెంటు ప్లాట్లలో, ప్లాటు దిక్కు, భార్యా భర్తల జన్మ నక్షత్రాలను బట్టి ఇరవై ఎనిమిది యంత్రాలలో నిర్దుష్టమైన యంత్రాన్ని తప్పనిసరిగా ప్రతిష్టించుకోవాలి.

కె.శారద ఆత్మకూరు

** పాత గృహాల్లో 'శక్తి' ఆవహించినపుడు ఏం చేయాలి?*

మండలం రోజులు 'తాళం' పెట్టిన గృహాల్లో 'శక్తి ఆవాహనకు' అవకాశం వుంది. ఆ గృహాల్ని శుద్ధిచేసి నారికేళ, కూష్మాండ బలులిచ్చి 'నరఘోష' లాంటి బలీయమైన యంత్ర ప్రతిష్ట చేయాలి.

కె.శ్రీనివాసులు నెల్లూరు

** వ్యాపారాల్లో చాలా నష్టపోయాను. మంచి సలహా ఇవ్వండి?*

ఆర్థిక లావాదేవీలు జరిపే 'సిట్టింగ్' కోణాల్ని చూసి ఏర్పాటు చేసుకోవాలి. తద్వారా వ్యాపారాభివృద్ధి జరుగుతుంది. నిర్దుష్టమైన 'ఇరు దేవతా' యంత్ర ప్రతిష్ట వలన భవిష్యత్తులో విపత్కర పరిస్థితిని బట్టి బయట పడతారు.

పి.వెంకటేశ్వరరావు తిరుపతి

** ఏయే 'తిథుల్లో' ఏయే ద్వారాల్ని ప్రతిష్టించకూడదు?*

పూర్ణిమ మొదలు అష్టమి వరకూ తూర్పు, అష్టమి నుంచి చతుర్థి వరకూ ఉత్తర, అమావాస్య నుంచి అష్టమి వరకు పశ్చిమం, నవమి నుంచి చతుర్థి వరకూ దక్షిణ ద్వార గృహాల్ని, ద్వారాల్ని ప్రతిష్ట లేదా నిర్మాణం చేయకూడదు.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

డి.ప్రభాకర్ నెల్లూరు

** 'పెన్నాతీరం' బోడిగాడితోట స్మశానానికి చుట్టుప్రక్కలవారి సమస్యలకు పరిష్కారం చెప్పండి?*

కాలుష్యానికి సంబంధించి అధికారులపై ఒత్తిడి తేవడం, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వడం, శక్తి, యంత్ర ప్రతిష్టలు చేసుకోవడం వంటివి చేయాలి.

ఇ.చిన్నబ్బాయి ఉదయగిరి

** వాస్తు లోపాలు సవరించుకొన్నాక అబ్బాయి జీవితం గాడిలో పడింది.*

మనుషులపై వాస్తు, జ్యోతిష, విధి ప్రభావాల వల్ల వారి స్థితిగతులు మారుతుంటాయి. నిక్కచ్చిత పరిష్కారాలు చేసేవారు సమస్యల నుండి విముక్తులవుతారు. రత్నధారణ వల్ల కూడా అతనికి మేలు జరుగుతుంది.

కె.అంజలి కర్నూలు

** 'కుజ'దోషం అంటున్నారు. ఒకరు చెప్పింది ఒకరు చెప్పడం లేదు?*

ఒకరికంటే ఎక్కువ మంది దగ్గర శాస్త్రం కోసం వెంపర్లాడటం అవివేకం. నిష్ణాతులెవరో నిర్ణయించుకొని వారినే కలవండి. వారు దోషమని చెబితే పరిహారం చేయించుకోండి. మానసిక 'వ్యధ' పడటం ఎందుకు?

పి.వి.శేషారత్నం కావలి

** అభిమానంగా వుంటారు. శాస్త్రం విషయం వారిని తృప్తిపరచబల్లేదా?*

శాస్త్రం ఏం చెబుతుందో అదే మీరు చెప్పండి. చెప్పకూడనివైతే తప్ప. వారిని తృప్తిపరచాలని శాస్త్ర జ్ఞులైన మీరు 'డూడూ' బసవన్నలు కాకండి.

నెల్లూరు ప్రజలకు శ్రీకుబేరా కుచ్చుటోపీ!

మనీసర్క్యులేషన్ స్కీం మోసాల నుంచి జిల్లా ప్రజలు తేరుకోక ముందే ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాల ప్రజలను శ్రీకుబేరా గ్రీన్‌ఫీల్డ్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డిపాజిట్ల పేర పెద్ద మొత్తాలు వసూలుచేసి చెల్లింపు చేసే సమయంలో పత్తా లేకుండా బిచాణా ఎత్తేసింది.

ఇటీవల కాలంలో జిల్లావ్యాప్తంగా అనేక పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఇదేవిధంగా పుట్టగొడుగుల్లా వివిధ రకాల పేర్లతో ఫైనాన్స్ కంపెనీలు, మనీస్కీం సంస్థలు పుట్టుకొస్తున్నాయి. తక్కువ మొత్తం పెట్టుబడి పెడితే 10రెట్లు అధిక మొత్తాలు చెల్లిస్తామని ప్రకటనలు, హామీలు గుప్పించి నగదును సేకరిస్తున్నారు. ఇటువంటి సంస్థల ప్రతినిధులు, ఏజెంట్ల మోసపూరిత మాటలు నమ్మిన ప్రజలు వారి స్థాయిని బట్టి పెట్టుబడులు పెట్టి ఆ తర్వాత ఆర్థికంగా మోసపోతున్నారు. ప్రైవేటు సంస్థలు ప్రారంభించిన వెంటనే పోలీసులు ఇతర శాఖలకు చెందిన అధికారులు స్పందించి ఈ సంస్థల వివరాలు రాబడితే ప్రజలు మోసపోకుండా వుండే అవకాశం వుంది. అలా కాకుండా సంస్థలను ఆర్భాటంగా ఏర్పాటు చేసి లక్షలు, కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన తర్వాత మేలుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతోంది.

మనీస్కీంలో ఎంతో నష్టపోయారు!

గత రెండు సంవత్సరాల క్రితం జిల్లాలో ప్రారంభమైన మనీస్కీం సంస్థలు వందల కోట్లలో నగదు వసూలు చేసి అడ్రస్ లేకుండాపోయిన సంగతి అందరికి తెలిసిందే. మనీస్కీం సంస్థలు వేలాది మంది ఏజెంట్లను నియమించుకుని గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతం వరకు డిపాజిట్లు వసూలు చేశాయి. ప్రస్తుతం ఈ సంస్థలపై సిఐడి పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పోలీసు శాఖ ముగ్గురు డిఎస్పీలను నియమించింది. ప్రధాన సూత్రధారుల నుంచి కొంత నగదు ఇతర ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. వసూలు చేసిన డిపాజిట్లకు, చెల్లించిన మొత్తాలకు నిర్వాహకులు చెప్పే వివరాలకు పొంతన వుండడం లేదు. దీంతో సిఐడి అధికారులు కేసును ఒక కొలిక్కి తీసుకురాలేక పోతున్నారు. మనీస్కీం సంస్థలు చేసిన మోసాన్ని తలపించే విధంగా శ్రీకుబేరా అనే సంస్థ ఫైనాన్స్ సంస్థ చేసిన మోసాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి.

జిల్లాలోని ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాల్లో శ్రీకుబేరా గ్రీన్‌ఫీల్డ్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీ ఏర్పాటైంది. మెట్ట ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలనుంచి 4,600 రూపాయలు వంతున వసూళ్లు చేశారు. ఇందుకు అదనంగా ఐదు సంవత్సరాలు 36 వేల రూపాయలు, 600లు చొప్పున ఏడాదిపాటు చెల్లిస్తే 15వేల రూపాయలు, 200లు చెల్లిస్తే పదివేలు అదనంగా అందజేస్తామని నమ్మబలికారు. నగదు చెల్లింపులకు సంబంధించి బాండ్లను కూడా జారీ చేయడం జరిగింది. జారీ చేసిన బాండ్లను కాలవ్యవధి ముగియడంతో నగదు చెల్లించాలని బాధితులు కోరగా త్వరలో చెల్లింపులు చేస్తామని నమ్మబలికిన ఈ సంస్థ ప్రతినిధులు కొద్ది రోజుల అనంతరం పత్తా లేకుండా పోయారు. కార్యాలయానికి వెళ్తే తాళం వేసి వుండడాన్ని చూసి ఆందోళన చెందారు. ప్రజల నుండి సేకరించి డిపాజిట్లతో వివిధ ప్రాంతాల్లో భూములు కొనుగోలుచేసి వున్నట్లు చెబుతూ వచ్చారు. కొందరికి భూమి అప్పగింత బాండ్లు రిజిస్ట్రేషన్ పత్రాలిచ్చారు. వీటిని పూర్తిగా విచారించాల్సి వుంది. జారీ చేసిన బాండ్లలో ప్రధాన కార్యాలయం నెల్లూరు విఆర్సీ సెంటర్ సమీపంలో ఐడిబి బ్యాంకు మిద్దెపై వున్నట్లు ముద్రించి వున్నారు. వాస్తవంగా నగరంలో ఈ సంస్థకు సంబంధించి కార్యాలయం లేకపోవడం విశేషం.

గతంలో ఉద్యోగాల పేరుతో మోసం

గతంలో ఇదే సంస్థకు చెందిన ఏజెంట్లు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుండి వేలాది రూపాయలు వసూలుచేసి మోసం చేసినట్లు తెలిసింది. బిట్రగుంట బేతనపేటకు చెందిన కొందరు కృష్ణపట్నం పోర్టులో ఉద్యోగాలిప్పిస్తామని విజయమహల్‌గేటు సమీపంలో ఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఉద్యోగాల కోసం భారీ మొత్తంలో నగదు చెల్లించిన వారికి నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులు తర్వాత మోసం చేసిన వారిని అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ ముఠాలోని వ్యక్తులకు సంబంధించిన బంధువులు ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాల్లో వుండడంతో ఏజెంట్లుగా నియమించి స్థానికంగా కార్యాలయాన్ని ప్రారంభించి గతంలాగానే ప్రజలను మోసం చేశారు. డిపాజిట్లు చెల్లించిన వారికి తిరిగి నగదు చెల్లింపులు జరగకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ సంస్థ నిర్వాహకులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు ఫైనాన్స్, మనీస్కీం సంస్థలకు ప్రారంభంలోనే అడ్డుకట్ట వేయాల్సి వుంది.

అక్రమ వేట

అల్లూరు చెరువులో చేపలు అన్యాక్రాంతం!

అల్లూరు చెరువులో చేపలు పట్టుకునే హక్కు విషయమై రెండు మత్స్యకార సొసైటీలు కోర్టుకెక్కాయి. ఈ వ్యవహారం పరిష్కారం కాక మునుపే లక్షలాది రూపాయలు విలువచేసే మత్స్య సంపదను రెండు సొసైటీల్లోని సభ్యులతోపాటు స్థానిక నేతలు నియమ నిబంధనలను అతిక్రమించి పట్టేస్తే మత్స్యశాఖాధికారులు చూస్తూ ప్రేక్షక పాత్ర వహించారు.

అల్లూరు చెరువులోని మత్స్యసంపద అన్యాక్రాంతం అవుతోంది. చెరువులో చేపల్ని పట్టుకొనే విషయంపై మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా వివాదం కోర్టు వరకు వెళ్లింది. రెండు సొసైటీల మధ్య చేపలు పట్టుకొనే విషయంలో రేగిన వివాదాన్ని అధికారులు పరిష్కరించలేకపోయారు. దీంతో రెండు సొసైటీల నిర్వాహకులు హక్కుల కోసం కోర్టుకెక్కారు. అల్లూరు చెరువులో దాదాపు 9సంవత్సరాల నుంచి చేపలు పట్టడం లేదు. ఈ చెరువు క్రింద ప్రతి సంవత్సరం రెండో వరిపంటకు ప్రభుత్వం అనుమతివ్వడం వల్ల చేపలు పట్టేందుకు సాధ్యపడలేదు. అయితే ఈ సంవత్సరం డెల్టా ప్రాంతంలో రెండో వరిపంటకు ప్రభుత్వం అనుమతివ్వకపోవడంతో అల్లూరు చెరువులో చేపలు పట్టాలని సొసైటీ నిర్వాహకులు నిర్ణయించారు.

గత 9 సంవత్సరాల నుంచి చేపలు పట్టకపోవడంతో చేపలు బాగా పెరిగిపోయి అధిక బరువుకు చేరాయి. ఒక్కో చేప ఐదు కిలోల నుంచి 20 కిలోల వరకు బరువు పెరిగింది. అల్లూరుకు సమీపంలోని గ్రామాల ప్రజలు చేపలు కొనుగోలు చేసేందుకు భారీ ఎత్తున తరలి వచ్చేవారు. కాని సంబంధితశాఖ నుంచి ఎటువంటి అనుమతి పొందకుండానే రెండు సొసైటీల నిర్వాహకులు చేపలు పట్టేందుకు శ్రీకారం చుట్టారు. చేపలు పట్టేందుకు భారీ వలలు ఉపయోగించారు. తూకం లేకుండానే ఒక్కో చేపకు ఒక్కో ధర నిర్ణయించి విక్రయించేశారు. మత్స్యశాఖ అధికారులు అల్లూరు చెరువులోని మత్స్య సంపద అన్యాక్రాంతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. కోర్టుకెళ్లిన రెండు సొసైటీలకు అనుమతి రాక ముందే చేపలు పట్టుకొనేందుకు చెరువులోకి దిగిన సమాచారాన్ని తెలుసుకొన్న స్థానికులు సైతం చేపలు పట్టుకుని వెళ్లడం విశేషం.

ఉచితంగా చేపలు దొరుకుతున్నాయన్న ప్రచారం జరగడంతో సమీప గ్రామాలకు చెందిన మగవాళ్లందరూ అల్లూరుకు చేరుకొని ఎవరికి తోచిన విధంగా వారు చేపలు పట్టుకొని వెళ్లారు. గతవారంలో మండలంలో ఏ గ్రామంలో చూసినా పొయ్యిమీద చేపల కూర సందడి కనిపించింది. అధికారులు చేతులెత్తేయడంతో స్థానిక రాజకీయ నేతల సహకారంతో తొలుత రాత్రి వేళల్లో చేపలు పట్టి విక్రయించేవారు. ఈ విధంగా లక్షలాది రూపాయలు సంపాదించుకున్నారు. అల్లూరు చెరువులో మత్స్యసంపద అన్యాక్రాంతం జరుగుతుందన్న విషయాన్ని తెలుసుకున్న అధికారులు ఆలస్యంగా స్పందించారు. చెరువులోకి ఏ ఒక్కరూ దిగరాదని ఆంక్షలు విధించారు. స్థానిక పోలీసులు రంగప్రవేశం చేసి చేపలు పట్టే కొందరిని వలలతో సహా స్టేషన్‌కు తీసుకెళ్లారు. పదిహేను వందల ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ చెరువులో నాలుగువైపుల నుంచి చేపలు పట్టుకోవడాన్ని పోలీసులు నియంత్రించేందుకు సాధ్యపడలేదు.

అధికారులు, పోలీసులు స్పందించేలోపు ఎనభై శాతం చేపలు మాయమైపోయాయి. కేవలం అల్లూరుకు ఆనుకుని వున్న ప్రధాన ముఖద్వారం వద్దనే పోలీసులు కాపలా వుండడవంతో మిగిలిన ద్వారాల నుండి చేపలు పట్టుకెళ్లి పోయారు. మత్స్యశాఖ అధికారులు సకాలంలో అల్లూరు చెరువులో చేపలు పట్టుకునేందుకు వేలం పాట నిర్వహించి వుంటే లక్షలాది రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమయ్యేది. కొన్ని ప్రాంతాల్లో చెరువుల్లో చేపలు పట్టుకునే హక్కును గిరిజన సొసైటీలకు ప్రభుత్వం అప్పగించింది. ఇదే తరహాలో అల్లూరు చెరువులో కూడా సొసైటీలకు అప్పగించాల్సి వుంటుంది. గతంలో అధికారపార్టీకి చెందిన ఒక నేత తమకు అనుకూలంగా వుండే మత్స్యకారులను సొసైటీగా ఏర్పాటుచేసి చేపలు పట్టుకునే హక్కుని కల్పించేందుకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. దీంతో కొందరు బినామీ సొసైటీలను ఏర్పాటు చేసుకొని చేపలు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు ప్రారంభించి కోర్టుదాకా వెళ్లారు.

ఏది అసలు, ఏది బోగస్ సొసైటీ అని గుర్తించడం అధికారులకు కష్టతరంగా మారింది. మరోప్రక్క అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు సంబంధితశాఖ అధికారులపై ఒత్తిడి తేవడంతో ఏం చేయలేక మౌనంగా వుండిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అల్లూరు చెరువులో చేపలు పట్టుకొనే హక్కును నిబంధనలు ప్రకారం ఏర్పాటు చేసుకున్న సొసైటీలకు అప్పగించాల్సిన అవసరం వుంది.

నిరాశపర్చే సాహసం!



✍ అల్లూరు రహీం

కథల విషయంలో పక్కాగా ఉంటానంటాడు హీరో గోపీచంద్. సినిమాల జాతకం పేపర్‌పై తెలిసిపోతుందని, అక్కడ సరిదిద్దుకోగలిగితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఈయన అభిప్రాయం. సినిమా నాణ్యత విషయంలో ఎంత ఆర్భాటాలు చేసినా అందులో కథ మిస్సవ్వకూడదని, సినిమాలో విషయముంటేనే ఆడుతుందని ఈ యువ హీరో నిశ్చితాభిప్రాయం. గతంలో యజ్ఞం, ఆంధ్రుడు, రణం, లక్ష్యం, శౌర్యం వంటి యాక్షన్ చిత్రాల్లో నటించిన గోపీచంద్ ఈ మధ్య పెళ్లి చేసుకొన్నాడు. యాక్షన్ సినిమాలకు బాగా నొప్పుతాడని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్-వెంకటేశ్వర సినీ చిత్ర సంయుక్త భాగస్వామ్యాన గోపీచంద్‌తో తీసిన సాహసం చిత్రం బొక్కబోర్లా పడింది. గతంలో లో బడ్జెట్ చిత్రాలను విజయవంతంగా తెరకెక్కించిన చరిత్ర ఉన్న దర్శకుడు చంద్రశేఖర్ యేలేటి. ఈయనే కథకుడు, స్క్రీన్‌ప్లే రచయితగా తీసిన సాహసం చిత్రంలో స్పార్క్ లేదు. కేరళలోని అనంతపద్మనాభస్వామి దేవాలయంలో దొరికిన నిధినిక్షేపాలు దర్శకుడిని ఈ కథ వ్రాసుకొనేట్లు చేసినట్లున్నాయి. సినిమా అన్నాక నవరసాలు ఉండాలి. సాహసంలో ఇవి లేవు. తాప్సిలాంటి హీరోయిన్ ఈ సినిమాలో ఉంటే ఆమెపై రెండు పాటలు చిత్రీకరించే ఆలోచన దర్శకుడు చేయలేదు. సంగీత దర్శకుడు 'శ్రీ' అందించిన పేలవమైన సంగీతం ఈ సినిమాను బాగా దెబ్బకొట్టింది. అయితే లడఖ్ చిత్రీకరించిన సన్నివేశాలకు కెమెరామెన్ శ్యామ్‌దత్ ప్రాణం పోశాడు. ఎత్తైన పర్వతశ్రేణులు, ప్రకృతి అందాలను తన కెమెరాలో ఒడిసి పట్టాడాయన. కళా దర్శకుడు రామకృష్ణ హింగ్ లాజ్‌దేవి మందిరం, నిధి నిక్షేపాలను దాచిన గుహను అద్భుతంగా సెట్టింగ్ వేశాడు. కొన్ని సన్నివేశాలను కంప్యూటర్ విజువల్ ఎఫెక్ట్స్‌లో సృష్టించారు. ఇవి మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకొంటాయి. స్క్రీన్‌ప్లే మరీ స్లోగా ఉండడం ఈ సినిమా చూస్తున్న వారిని విసుగు తెప్పిస్తుంది. సాహసం చిత్రాన్ని ఒకలా తీయను ప్రయత్నించి మరోలా తీసేశాడు దర్శకుడు.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే హైదరాబాద్‌లోని గరుడ సెక్యూరిటీ ఏజెన్సీలో గార్డ్‌గా గౌతమ్(గోపీచంద్) పనిచేస్తుంటాడు. ఏదోలా జాక్‌పాట్ కొట్టి కోట్లు సంపాదించాలని కలలు కంటుంటాడు. ఒకరోజు వర్షం పడుతుండగా ఇంట్లో సీలింగ్ ఊడి దాంట్లో నుంచి ఒక డైరీ, లాకెట్ దొరుకుతాయి. డైరీ చదవగా అందులో గౌతమ్ తాత సత్యనారాయణశర్మ(సుమన్) పాకిస్తాన్‌లోని పెషావర్‌లో వజ్రాల వ్యాపారని, దేశ విభజన సమయంలో అక్కడ అల్లర్లు జరుగుతుండగా సంపదతో బయలుదేరిన అతను ఓ రహస్య మార్గం నుంచి వస్తుండగా సంపద మొత్తం ఒక గుహలో పడిపోయినట్లు వ్రాసి ఉంటుంది. ప్రపంచం త్వరలోనే అంతమై పోతుంది. ఈలోగా చూడాల్సిన హిందూ క్షేత్రాలన్నీ చూసేయాలని భావించే యువతి శ్రీనిధి(తాప్సి) పాకిస్తాన్ దేశంలోని పెషావర్‌లో హింగ్ లాజ్ దేవి మందిర దర్శనానికి ఆధ్యాత్మిక వాదులను రమ్మని ప్రచారం చేస్తుంటుంది. నిధి అన్వేషణలో భాగంగా ఈమెతో కలిసి పాకిస్తాన్ వెళ్తాడు గౌతమ్. ఈ నిధి కోసం పాకిస్తాన్‌లోని చారిత్రక పరిశోధకుడు ఆలం సిద్ధికీ అన్వేషిస్తుంటాడు. దీన్ని కొట్టేయను సుల్తాన్(శక్తి కపూర్) అతన్ని చంపేస్తాడు. ఈ సమయంలోనే అక్కడకు వెళ్లిన గౌతమ్, శ్రీనిధి పలు కష్టనష్టాలకు ఓర్చి ఈ నిధిని స్వంతం చేసుకోవడంతో చిత్రకథ ముగుస్తుంది. సాహసం చిత్రంలో సాహసోపేత సన్నివేశాలు తగ్గాయి. ఏదో ఉంటుందని భావించి ఈ సినిమాకు వెళ్లే ప్రేక్షకులను నిరాశ పర్చే చిత్రం సాహసం.

మళ్లీ షాజన్ పదమ్‌సీ!



ఆరెంజ్ సినిమాలో రామ్‌చరణ్ ప్రియురాలిగా నటించిన షాజన్ పదమ్‌సీ ఈ చిత్రంలో జెనీలియాతో పోటీపడి మరీ అందంగా కనిపించింది. అయితే ఆరెంజ్ బాక్సీఫీసు దగ్గర పరాజయాన్ని చవిచూడడంతో షాజన్ తెలుగులో అవకాశాలు అందుకోలేక పోయింది. హిందీలో మాత్రం 'దిల్‌తో బచ్చా హైజీ' లాంటి చిత్రాల్లో నటించి మురిపించింది. చాలా రోజుల తర్వాత ఈ ముద్దుగుమ్మ తెలుగులో మరొక అవకాశాన్ని సంపాదించింది. వెంకటేష్, రామ్ కలసి నటిస్తున్న గోల్‌మాల్ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. హిందీలో విజయవంతమైన బోల్ బచ్చన్‌కు రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కబోతోంది. విజయ్‌భాస్కర్ దర్శకుడు. ఇందులో రామ్‌తో కలిసి ఆడిపాడబోతోంది షాజన్. ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ ఆశలన్నీ ఈ సినిమాపైనే ఉన్నాయి. హిందీలో కూడా సరైన అవకాశాల్లేకపోవడంతో తెలుగులో స్థిరపడి పోవాలని చూస్తోంది. అది జరగాలంటే గోల్‌మాల్ విజయం అందుకోవాల్సిందే. ఈ చిత్రంలో షాజన్ వినోదాన్ని పండిస్తుందట.



అనుష్క ఎదురుచూపు!

బాహుబలి, రుద్రమదేవి, వర్ణ ఈ మూడు సినిమాలు ప్రత్యేకమైనవి. చారిత్రాత్మక సోషియో ఫాంటసీ కథాంశాలతో తెరకెక్కబోతున్న సినిమాలివి. భారీస్థాయిలో తెరకెక్కుతున్న ఈ మూడు చిత్రాల్లోనూ అనుష్కనే హీరోయిన్. వీటిలో మొదట ప్రేక్షకుల ముందుకొచ్చేది వర్ణ. తెలుగు తమిళ భాషల్లో రూపొందిన ఈ చిత్రానికి సెల్వరాఘవన్ దర్శకుడు. ఆర్య హీరో. ఈ సినిమా హీరోయిన్ ఓరియెంటెడ్ బాణీలో నడుస్తుంది. కథంతా అనుష్క పాత్ర చుట్టూనే తిరుగుతుంది. ఈ సినిమా కోసం అనుష్క యుద్ధ విద్యలు కూడా నేర్చుకొంది. తన కెరీర్‌లో మరో అరుంధతి అవుతుందనే నమ్మకంతో వుంది. ఈ సినిమా విడుదల కోసం ప్రత్యేకంగా ఎదురు చూస్తోంది అనుష్క.

తెలుగులో క్రిష్-3!



హృతిక్‌రోషన్ సూపర్‌మేన్ అవతారంతో నటించిన చిత్రం క్రిష్. రాకేష్ రోషన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం 2006లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. భారీ వసూళ్లు కొనసాగించింది. ఈ సినిమాకు కొనసాగింపుగా క్రిష్-2 వచ్చింది ఇది కూడా చక్కటి ఫలితాన్ని సాధించింది. మూడో చిత్రంగా క్రిష్-3 పేరుతో మరో చిత్రం రూపొందుతోంది. వచ్చే దీపావళి మరుసటి రోజున ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుంది. హిందీతోపాటు తెలుగులోనూ ఒకేసారి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తొలిచిత్రం క్రిష్ తెలుగులో చక్కటి వసూళ్లను రాబట్టుకొంది. ముఖ్యంగా చిన్నపిల్లలను ఈ చిత్రం అమితంగా ఆకట్టుకొంది. క్రిష్-3పై కూడా అదేస్థాయి అంచనాలు ఉన్నాయి. మరి ఎలాంటి ఫలితాన్ని సాధిస్తుందో చూడాలి.



నిర్మాతగా జెనీలియా

బొమ్మరిల్లు, శశిరేఖాపరిణయం, రెడీ, కథ చిత్రాల్లో కథానాయిక జెనీలియా హిందీ నటుడు రితేష్ దేశ్‌ముఖ్‌ను వివాహం చేసుకుని నటనకు విరామమిచ్చింది. మళ్లీ కెమెరా ముందుకు వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకొంటున్న జెనీలియా మాట్లాడుతూ ఈ యేడాది రెండు హిందీ చిత్రాల్లో నటిస్తున్నాను. అందులో ఇట్స్ మై లైఫ్ ఒకటి. ఇది తెలుగులో వచ్చిన బొమ్మరిల్లుకు రీమేక్. రాక్ ద షాదీలోనూ నటిస్తాను. రితేష్ నిర్మాతగా ఓ చిత్రం నిర్మితమవుతోంది. దీనికి సంబంధించిన నిర్మాణ బాధ్యతల్లో పాలుపంచుకొంటున్నాను. ఈ సినిమా పేరు బాలక్... పాలన్. చిన్నారులకు విజ్ఞానం కలిగించే చిత్రం. ఈ సినిమాలో పాఠశాలలు, కళాశాలలు, తల్లితండ్రులకు కొన్ని సూచనలు చేస్తామంటోంది జెనీలియా.

గ్లామర్ అంటే ఏమిటి?



గబ్బర్‌సింగ్, బలుపు చిత్రాల విజయాలు హీరోయిన్ శృతిహాసన్‌లో ఉత్సాహాన్ని నింపాయి. బలుపు సినిమాలో గ్లామర్‌ను ఎక్కువగా ఒలకబోసినట్లున్నారంటే; సమాధానంగా గ్లామర్ అనే మాటకు ఇప్పటికీ నాకు సరైన అర్థం తెలియదు. తెరపై నేనెలా కనిపించాలన్న విషయం కేవలం ఆ పాత్ర మాత్రమే నిర్ణయిస్తుంది. దానికి తగ్గట్టుగానే నేను నడుచుకొంటాను. బలుపులో నేను గ్లామర్‌గా కనిపించానంటే కారణం ఆ పాత్ర ఆ తరహాలో సాగింది. మా అమ్మా - నాన్నలు కూడా కెరీర్ ఆరంభంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొన్నారు. కొన్ని సందర్భాల్లో కథరీత్యా బోల్డ్‌గా నటించారని కూడా చెప్పుకొచ్చింది.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు.

భవిష్యత్తు బిజెపిదే!

కార్యకర్తలకు వెంకయ్యనాయుడు భరోసా

ఉందిలే మంచి కాలం ముందు ముందునా... అన్న పాటను గుర్తు చేసుకొంటున్నది బిజెపి. గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడి సారధ్యంలో 2014 ఎన్నికలకు సిద్ధమవుతున్న ఆ పార్టీ కార్యకర్తలను సంఘటితం చేసి ఎన్నికలకు సంసిద్ధులను చేసేందుకు విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలో ఇటీవల బిజెపివైఎం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సమావేశానికి బిజెపి జాతీయనేత ఎం.వెంకయ్యనాయుడు విచ్చేసి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తు బిజెపిదేనని చెప్తూ పార్టీ శ్రేణులకు స్ఫూర్తినింపేలా ఉపన్యసించారు. కష్టపడితే తప్పకుండా ఫలితం వుంటుందన్న ఆయన సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి జాతీయ స్థాయికి తన ఎదుగుదలను ప్రస్తావించారు. సీనియర్ నేతలు వాజ్‌పాయ్, అద్వానీలు జిల్లాకు వచ్చినపుడు జెండాలు కట్టి, పోస్టర్లు అంటించి, మైకుల్లో ప్రచారం చేసిన తాను అదే నేతల సరసన కూర్చొనే అవకాశం లభించడం ఎంతగానో సంతోషాన్నిచ్చిన సంఘటనలను చెప్తూ ఉద్వేగానికి గురయ్యారు. తనలాగే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సామాన్య కార్యకర్తలా పార్టీలో పనిచేసి నేడు అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడని వివరించారు. దీనిని దృష్టిలో వుంచుకొని కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి తేవాలని, నరేంద్రమోడిని ప్రధానిగా చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో పతనమైందని విమర్శలు గుప్పించారు. ఈ సమావేశంలో బిజెపి నేతలు సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, సురేష్‌రెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మొగరాల సురేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిఇఓపై పోరాటం!

విజయం సాధించలేని సంఘాలు

జిల్లా విద్యాశాఖ అవినీతిపై కొత్తగా చెప్పడానికి ఏమీలేదు. ఎన్నిసార్లు ప్రస్తావించుకొన్నా, ఎందరు విమర్శలు చేసినా, ఆరోపించినా విద్యాశాఖలో జరిగే అవినీతి అక్రమాలను అరికట్టలేక పోతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన పలువురు ఎన్నోసార్లు తనిఖీలుచేసి, పద్ధతి మార్చుకోమని హెచ్చరికలు చేసినా వారి మాట వారిదే, వీరి దారి వీరిదే అన్నట్లుగా ఎలాంటి మార్పు రాలేదు. ఈ పరిస్థితుల్లో జిల్లా విద్యాశాఖాధికారిగా మువ్వా రామలింగం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యాశాఖపై మరింతగా విమర్శలు వ్యక్తమౌవుతున్నాయి. దీనికి రామలింగం వ్యవహారశైలే కారణం. అవినీతి అధికారిగా ముద్రపడి పలుమార్లు ఎసిబికి దొరికిన ఆయన తన తీరు మార్చుకోలేదు. దీనికితోడు ఆనం సోదరుల ఆశీస్సులు పుష్కలంగా వుండడంతో ఏమిచేసినా తనను ఎవ్వరూ ఏమీ చేయలేరన్న ధీమా ఆయనలో వ్యక్తమవుతోంది. డిఇఓ అవినీతిపై విచారణ జరపాలని, ఆయనపై చర్యలు చేపట్టాలని గత కొంతకాలంగా ఎమ్మెల్సీలు వికపు బాలసుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేస్తూ వస్తున్నారు. దీనికి ప్రతిగా డిఇఓ రామలింగం వారిపై ప్రతి విమర్శలు చేసి వున్నారు. ఈ నేపథ్యంలో తిరిగి డిఇఓ అవినీతిపై యుటిఎఫ్, ఎపిటిఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై బహిరంగ విచారణకు సిద్ధపడాలని ఉపాధ్యాయ సంఘాలు, శాసన మండలి సభ్యులు, తాను సిద్ధమేనని డిఇఓ ప్రకటనలు చేయడంతో ఈ వివాదం ముదిరిపాకాన పడింది. ఎన్ని విమర్శలు, ఆరోపణలు వచ్చినా ఎలా బయటపడాలో, ఎవరిని శరణువేడాలో రామలింగానికి తెలిసినంతగా మరెవరికి తెలుసు.

నెల్లూరులో నాకా బంద్!


పట్టుకొన్న డబ్బుతో బాలాజీనగర్ సిఐ మంగారావు.

గ్రామ పంచాయితీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నగరంలో పోలీసులు నాకా బంద్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 9వ తేదీన జిల్లా కలెక్టర్ ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. నోటిఫికేషన్ జారీచేసినప్పటి నుంచి పోలీసులు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి వాహనాన్ని నిలిపి తనిఖీలు చేస్తున్నారు. గ్రామాల్లో జరుగుతున్న పంచాయితీ ఎన్నికలకు నగరం నుండి నగదు, మద్యం సరఫరా అవుతున్నాయన్నది వాస్తవం. అందువల్ల నగరం నుండి బయట ప్రాంతాలకు వెళ్లే వాహనాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇందుకోసం శిక్షణలో వున్న పోలీసులను ప్రత్యేకంగా నియమించడం జరిగింది. సిఐ, ఎస్‌ఐల పర్యవేక్షణలో తనిఖీలు జరుగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాల్సిన పోలీసులు నగరంలో చేస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. నగరానికి నాలుగు వైపులా వున్న వెంకటేశ్వరపురం, హరనాధరపురం, కొండాయపాళెం, అయ్యప్పగుడి, డైకస్‌రోడ్డు, మూలాపేట, నవాబుపేట, కిసాన్‌నగర్ శివారు ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పై ప్రాంతాల్లో ఎక్కువ సిబ్బందిని నియమించి వాహనాలను తనిఖీలు చేస్తే ఎన్నికల కోసం తరలించే నగదు, మద్యం దొరికే అవకాశం వుంటుంది. ఇటీవల రామలింగాపురం ప్రాంతంలో బాలాజీనగర్ సిఐ మంగారావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను నిలిపి సుదీర్ఘ తనిఖీ చేయడం విమర్శకు దారితీసింది.

సమీక్షలపై శ్రద్ధ చూపని అధికారులు

కలెక్టర్ మందలింపుతోనైనా మారుతారా?

తాను చెడ్డ కోతి వనం అంతా చెడిచిందన్న సామెతను గుర్తుకు తెస్తున్నారు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు కొందరు. తమ శాఖకు సంబంధించిన అంశాలపై అవగాహన లేకుండానే సమీక్షా సమావేశాలు, ఇతరత్రా జిల్లాస్థాయిలో జరిగే సమావేశాలకు హాజరవుతూ తప్పుడు లెక్కలు చెప్పడం, లేదంటే ఉన్నతాధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేక నీళ్లు నమలడం ఇటీవల సర్వసాధారణమైంది. పలువురు మంత్రులు, పార్లమెంటు సభ్యులు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు అనేకం వున్నాయి. జిల్లా కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ జిల్లాకు సంబంధించి వివిధ అంశాలను అవగాహన చేసుకొనే క్రమంలో కొందరు అధికారులు అరకొర వివరాలను తెలుపుతుండడం, సరైన సమాచారం అందజేయక పోవడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఇరిగేషన్ అధికారులతో సమావేశం సందర్భంగా క్యాచ్‌మెంట్ ఏరియా తదితర అంశాలపై ప్రశ్నించగా సమాధానం చెప్పలేక పోవడంపై కలెక్టర్ స్పందిస్తూ ఆయాశాఖల అధికారులే సరిగా వివరించలేకపోతే తనకు ఎలా అవగాహన వస్తుందని ప్రశ్నించారు. ఇటీవల పంచాయితీ ఎన్నికలకు సంబంధించి వివరాలు తెలిపే క్రమంలో సంబంధిత అధికారులు కాకి లెక్కలు చెప్పడంతో వివరాలు గందరగోళంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు ఇలాంటి వాటి విషయంలో ఒళ్లు దగ్గర పెట్టుకొని చెప్పకపోతే కలెక్టర్‌కు చెడ్డ పేరు రావడం ఖాయం.

మహా మాయగాళ్లు!

నెల్లూరులో విమర్శలపాలవుతున్న బంగారు వ్యాపారస్తులు


బంగారు నగలు పరిశీలిస్తున్న రైల్వే డిఎస్పీ నాయుడు.

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొట్టేందుకు బంగారు వ్యాపారులు టక్కుటమార విద్యలు ప్రదర్శిస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువచేసే బంగారు ఆభరణాలను, ముడి బంగారును వివిధ రూపాలలో బొంబాయి వంటి మహానగరాల నుంచి అక్రమంగా, ప్రభుత్వ లెక్కలకు దొరక్కుండా తెప్పిస్తూ లక్షల రూపాయల పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారు. ఈ అక్రమ వ్యాపారం చాలాకాలంగా జరుగుతున్నా సంబంధిత అధికారులకు తెలియకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒక మహిళ బ్యాగు రైల్లో పోవడం, ఆమె ఇద్దరు యువకులను అనుమానించి రైల్వే పోలీసులకు చెప్పడం, వారు ఆ ఇద్దరి సూట్‌కేసులు తనిఖీ చేయడంతో ఈ అక్రమ బంగారు వ్యాపారం వెలుగు చూసింది. నగరానికి చెందిన ఒక మార్వాడి వ్యాపారి పెద్దఎత్తున తన సిబ్బందితో బంగారాన్ని తెప్పిస్తూ అనుకోని పరిస్థితుల్లో, సినీ ఫక్కీలో దొరికిపోయారు. అనుకోకుండా బంగారం దొరకడంతో రైల్వే పోలీసులు, ఇన్‌కం టాక్స్, కమర్షియల్ టాక్స్ అధికారులు తీరిగ్గా రంగంలోకి దిగారు. ఈ అక్రమ వ్యాపారం చాలాకాలంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక బంగారు వ్యాపారస్తుల నుంచి అందుతున్న పెద్ద పెద్ద కానుకలేనన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇక అక్రమ బంగారు వ్యాపారం చేసేవాళ్లు హైరిస్క్ తీసుకొని సాగిస్తున్నారు. రైల్లో పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు తెచ్చే సమయాల్లో దొంగల బారిన పడిన ఘటనలు, ప్రాణాలమీదకు తెచ్చుకొన్న ఘటనలు అనేకం జరిగివున్నా ప్రభుత్వానికి కట్టాల్సిన ట్యాక్స్ మిగులుతుందన్న ఆశతో ఇంతటి ప్రమాదాన్ని లెక్కచేయక అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ఈ అక్రమాల్లో దొరికితే దొంగలు, దొరక్కపోతే దొరలు అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు.

ఎస్సీ కాలనీల్లో బిసిలకు రిజర్వుడు!

పంచాయితీ ఎన్నికల్లో అధికారులు చేసిన తప్పులివి.

గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అధికారులు చేసిన తప్పిదాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్లలో గందరగోళం నెలకొనింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు రిజర్వేషన్లను ఖరారు చేయాలని ఆదేశించడంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో కొన్ని గ్రామ పంచాయితీల్లో పొరపాట్లు జరిగాయి. చేసిన పొరపాట్లను సరిదిద్దుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. ఎస్సీ, ఎస్టీలు అధికంగా వున్న వార్డుల్లో ఒకటి బిసికి కేటాయించడం, బిసిలు వున్న వార్డుల్లో ఎస్సీలకు కేటాయించడం జరిగింది. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత పరిశీలించిన ఆయా గ్రామస్తులు అధికారులు చేసిన తప్పులను గుర్తించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సవరణలు చేయలేక పోయారు. భార్యాభర్తల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో వుండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయినప్పటికీ భార్య ఓటు ఒక పోలింగ్ కేంద్రంలో, భర్త ఓటు మరో పోలింగ్ కేంద్రంలో చేర్చి వున్నారు. అల్లూరు గ్రామ పంచాయితీ పరిధిలో వున్న రాయపేట గ్రామాన్ని రెండు వార్డులుగా విభజించారు. ఈ గ్రామంలో మొత్తం ఎస్సీలే వున్నారు. ఒకటి ఎస్సీ రిజర్వుడు కాగా, మరొక వార్డును ఓసిలకు కేటాయించి అధికారులు ఘనతను చాటుకున్నారు. ఓసి లేలేని వార్డును ఓసిలకు ఎలా కేటాయించారో వారికే తెలియాలి.

జైపాల్‌రెడ్డి

మొదటి పేజీ కొరవ

మంత్రి పదవి తీసుకోమని ఆయన్ను అడిగారన్నది ఒక వదంతి. కిరణ్‌కుమార్‌రెడ్డిని తొలగించి ఆయన్ను గద్దె ఎక్కించబోతున్నారనేది మరొక వదంతి. తెలంగాణ అంశానికి సంబంధించి రోడ్ మ్యాప్ తీసుకొని రమ్మని అధిష్టానం నుంచి పిలుపు రాగానే కిరణ్ కుమార్‌రెడ్డి శిబిరం ఒక పుకారును వ్యాపింప చేసింది. తెలంగాణ ఇవ్వక తప్పనిసరి పరిస్థితి వస్తే కిరణ్ రాజీనామా చేస్తాడన్నది ఆ లీక్ సారాంశం. జాతీయ మీడియాలో ఈ వార్త బాగా ప్రచారమైంది. అది సోనియాగాంధీ దృష్టికి వెళ్లింది. వెంటనే కిరణ్‌ను పిలిపించి చీవాట్లు పెట్టారామే. దానితో తన రాజీనామా వార్త ఒట్టి పుకారే అని వివరణ ఇచ్చుకొన్నాడు ముఖ్యమంత్రి. దీనివెనుక ఒక నేపథ్యం వుంది. 2008లో ఒకసారి తెలంగాణ ఇవ్వడానికి సోనియాగాంధీ సిద్ధపడినప్పుడు, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేరుగా ఆమె వద్దకే వెళ్లి, తెలంగాణ మీద శాసనసభలో తీర్మానం పెట్టడం నా వల్ల కాదు, నేను పక్కకు తప్పుకొంటాను, మీరు వేరేవాళ్లను పెట్టి తీర్మానం చేయించండి అని చెప్పాడట. ఆ నమూనాలోనే తాను కూడా రాజీనామా అస్త్రం ప్రయోగిస్తే సోనియాగాంధీ వెనక్కు తగ్గుతారని భావించినట్లున్నాడు కిరణ్. అయితే అది వికటించింది.

తెలంగాణ ఇవ్వాల్సి వస్తే కిరణ్ ఒక సమస్యగా మారుతాడన్న భయం అధిష్టానంలో కల్గిందని చెప్తున్నారు. శాసనసభ తీర్మానం సమయంలో ఆయన రాజీనామా అంటే లేనిపోని సమస్యలు వస్తాయి. అందువల్ల ముందుగానే తప్పించి, జైపాల్ రెడ్డి వంటి తెలంగాణ వాదిని ఆ స్థానంలో పెట్టి, తీర్మానం ప్రవేశపెడితే ఇబ్బందులు తప్పుతాయన్నది ఒక ఆలోచన అంటున్నారు. జైపాల్‌రెడ్డికి వున్నట్లుండి రాజకీయ ప్రాధాన్యత పెరగడానికి ఇదొక్కటే కారణంగా కన్పిస్తున్నది.



సూళ్లూరుపేట మండలంలో ప్రమీల రాజ్యంలా కోటాపోలూరు గ్రామ పంచాయితీకి సర్పంచ్, పన్నెండు మంది వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మహిళా ప్రతినిధులతో కాంగ్రెస్ నాయకుడు ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

కర్ణాటక శాస్త్రీయ సంగీత కచ్చేరి!

నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ కుమారి సర్వేపల్లి శ్రియ కర్ణాటక శాస్త్రీయ సంగీత కచ్చేరిని 21వ తేది సాయంత్రం టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసింది. యనమండ్ర నాగదేవి ప్రసాద్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం మొదలవుతుంది. మల్లాది సచ్చిదానంద మూర్తి, సినీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారు. వీరిశెట్టి హజరత్‌బాబు, మునుగంటి శ్రీరామమూర్తి ఆత్మీయ అతిథులుగా విచ్చేస్తారు. ఈ సభలోనే భైరవీ సంగీత అకాడమీ ముఖ్య నిర్దేశకులు సంగీతాచార్య డాక్టర్ వైజర్సు బాలసుబ్రహ్మణ్యంకు కళాంజలి పురస్కారం అందిస్తారు. సంగీత అభిమానులను ఈ సభకు తరలి రమ్మంటున్నారు నిర్వాహకులు.

డిఇఓపై కలెక్టర్ ఆగ్రహం

విద్యాశాఖ వివరాలు సరిగా చెప్పలేని డిఇఓ రామలింగంపై జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గోల్డన్‌జూబ్లీ హాలులో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సందర్భంగా విద్యాశాఖ ప్రస్తావన వచ్చింది. కలెక్టర్ డిఇఓను ఉద్దేశించి విద్యాశాఖలో నువ్వేంచేస్తావ్? నీ బాధ్యతలేమిటి? జిల్లాలో ఎన్ని పాఠశాలలు వున్నాయి? ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు? ఎందరు సక్రమంగా బడికి పోతున్నారంటూ ప్రశ్నల వర్షం కురిపించడంతో డిఇఓ వాటికి సమాధానం చెప్పలేక పోయారు. దీంతో ఆగ్రహించిన కలెక్టర్ మీరు ఎవరెవరు ఏమి చేస్తారో వివరాలు అందజేయాలని ఆదేశించారు.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వితరణ!

నెల్లూరులోని ప్రముఖ సేవా సంస్థ హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్‌కు వదాన్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 50వేల రూపాయలను విరాళంగా అందించారు. మాగుంట లేఅవుట్‌లోని హెల్పింగ్ హ్యాండ్ సంస్థ కార్యాలయానికి స్వయంగా వెళ్లిన ప్రభాకర్ రెడ్డి 50వేల రూపాయల చెక్కును కృష్ణారెడ్డికి అందించి ఆయన చేస్తున్న సేవలను ప్రస్తుతించారు. సంస్థకు సహాయం చేసిన ప్రభాకర్‌రెడ్డికి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు చెల్లించారు.

చెప్పను... చేసి చూపిస్తా!

జిల్లా కొత్త ఎస్పీ రామకృష్ణ మెత్తగా వుంటూనే సిబ్బందికి కరుకుగా ఆదేశాలు జారీ చేస్తున్నాడు. గ్రీవెన్స్‌సెల్‌కు వివిధ సమస్యల నిమిత్తం వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆయన అక్కడి కక్కడే సమస్య పరిష్కారానికి సిబ్బందికి సూచనలు ఇస్తున్నాడు. సిఐ, ఎస్‌ఐలే కాకుండా స్టేషన్ రైటర్‌తోనూ నేరుగా మాట్లాడుతూ చెప్పిన పని గుర్తుంచుకొని బాధితులకు న్యాయం చేయాలి. లేదంటే నా సంగతి తెలీదు. ఏమీ చెప్పను చేసి చూపిస్తాను అంటూ హెచ్చరికలు చేస్తున్నారు.

రోశయ్య జన్మదినోత్సవం చేసిన నెల్లూరీయులు!

తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య 81వ జన్మదినోత్సవ వేడుకలను చెన్నైలోని గవర్నర్ బంగ్లాలోని దర్బార్ హాల్‌లో నెల్లూరు ఆర్యవైశ్య నాయకులు 5వ తేది ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిన్ననాటి మిత్రుడు కె.వి.చలమయ్య, పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ అమరా శ్రీరాములుశెట్టి గజమాల వేసి దుశ్శాలువతో రోశయ్యను సన్మానించారు. 80 కిలోల కేక్‌ను రోశయ్య కట్ చేశారు. తన పుట్టిన రోజు జరపను నెల్లూరు నుంచి వచ్చిన అతిథులకు రోశయ్య రాజ్‌భవన్‌లో విందు ఏర్పాటు చేశారు.

7.43 లక్షల నగదు స్వాధీనం

పంచాయితీ ఎన్నికలను పురస్కరించుకొని పోలీసులు వివిధ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. స్థానిక చిల్డ్రన్స్ పార్కు సమీపంలో పోలీసులు తనిఖీ చేస్తుండగా ఇరువురు వ్యక్తుల వద్ద నుంచి 7.43 లక్షల రూపాయలు నగదు వున్నట్లు గుర్తించి దీనిపై ఆరా తీశారు. వారు సరిగా సమాధానం ఇవ్వలేక పోవడంతో ఆ మొత్తాన్ని పోలీసులు స్వాధీన పరుచుకొని కోర్టులో డిపాజిట్ చేశారు.

సిమ్ కార్డు విక్రేతలపై పోలీసుల దాడి

స్థానిక విఆర్‌సి సెంటర్‌లో వివిధ కంపెనీల సిమ్‌కార్డులు విక్రయిస్తూ ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండానే కనెక్షన్స్ ఇస్తున్న అమ్మకం దారులపై డిఎస్పీ ఆధ్వర్యంలో నాల్గవ పట్టణ పోలీసులు దాడి చేశారు. గత కొంత కాలంగా చైతన్య అనే వ్యక్తి ఈ సిమ్ కార్డుల వ్యాపారం చేస్తున్నాడు. ఇతనితో రామలింగాపురంలో గల స్మైల్ మొబైల్స్ నిర్వాహకుడు కలసి అధిక మొత్తానికి ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా కనెక్షన్ ఇస్తుండడంపై ఫిర్యాదులు అందడంతో పోలీసులు కాపుకాచి దాడి చేసి ఇరువురిని అరెస్టు చేశారు.

పెట్రోల్ ధర మళ్లీ పెరిగింది

పెట్రోల్ ధరలు మళ్లీ పెరిగాయి. ఈ ఏడాది పలుమార్లు పెట్రోల్ ధరలు పెరగ్గా, ఈ నెలలో ధరలు పెరగడం ఇది రెండవ సారి. పన్నులతో కలిపి లీటరుపై 2.02 పైసలు పెంచాయి చమురు కంపెనీలు. దీంతో 74.65 రూపాయలు వున్న పెట్రోల్ ధర 76.67 రూపాయలు అయ్యింది. పెరిగిన ధరల కారణంగా వినియోగదారులపై లక్షల రూపాయల అదనపు భారం పడనుంది.

ఖురాన్ ప్రతుల పంపిణీ!

రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని హాజీ అబ్దుల్ అజీజ్ ట్రస్ట్ నేతృత్వంలో ఖురాన్ అరబ్బీ ఇంగ్లీషు, తెలుగు ప్రతులను 9వ తేది పంపిణీ చేశారు. ఖురాన్ పఠనంతో అందరికీ శుభాలు చేకూరుతాయన్న శుభ సంకల్పంతో అబ్దుల్ అజీజ్ ఈ పనికి శ్రీకారం చుట్టారు.

కోటంరెడ్డి శీనయ్యకు అస్వస్థత

తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అస్వస్థతకు గురయ్యారు. వివిధ కార్యక్రమాలు చేపడుతున్న ఆయనకు వున్నట్లుండి గుండెపోటు రావడంతో 16వ తేది నారాయణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు రక్తాన్ని సరఫరా చేసే ఒక నాళం మూసుకుపోయి వున్నట్లు గుర్తించి స్టెంట్ వేశారు. ఎలాంటి ప్రమాదం లేదని తెలపడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. అనారోగ్యానికి గురైన శీనయ్యను పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు పరామర్శించారు. సినీ హీరో బాలకృష్ణ సైతం ఆస్పత్రిలో వున్న శ్రీనివాసులురెడ్డి ఆరోగ్యం గురించి వాకబు చేశారట.

చెంగాళమ్మకు విరాళం

సూళ్లూరుపేట చెంగాళమ్మ తల్లికి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ప్రియ తన మనుమడు రతన్ పేరున 1.02 లక్షల విరాళాన్ని అందజేశారు. ఇటీవల ఆలయాన్ని సందర్శించిన వారి కుటుంబం అన్నదాన పథకం అమలుకు సంతోషించి ఈ మొత్తాన్ని తమ ప్రతినిధి ద్వారా ఆలయ ఛైర్మన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డికి అందజేశారు.

ప్రోత్సాహకాలను పెంచాలి

ఏకగ్రీవమైన పంచాయితీలకు అభివృద్ధి కోసం ఇచ్చే మొత్తాలను పెంచాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న మొత్తాలను కాకుండా మేజర్ పంచాయితీకి 20 లక్షల రూపాయలను, మైనర్ పంచాయితీకి పది లక్షల రూపాయలను ఇవ్వాలని కోరారు. ఆ మొత్తాలతో పంచాయితీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం లభిస్తుందన్నారు.

ఏ.కోదండరామిరెడ్డికి మాతృవియోగం!

తెలుగు సినీ పరిశ్రమలో సూపర్‌హిట్ దర్శకునిగా ఖ్యాతి గడించిన నెల్లూరీయుడు ఏ.కోదండ రామిరెడ్డి తల్లి ఆవుల రమణమ్మ(89) గంగపట్నం గ్రామంలో 12వ తేది మరణించారు. ఈమె అంత్యక్రియల్లో వర్ధమాన హీరో వైభవ్ కూడా పాల్గొన్నాడు.

జనవాణి

2వ పేజీ కొరవ

వీళ్లంతా దీర్ఘకాలంగా అడుగుతున్న స్థానిక సంస్థలకు సంబంధించిన 29 అంశాలపై వీరికి అధికారాలు అప్పగించకపోవడం దురదృష్టకరం. ఈ పని జరగకపోతే ఎన్నికలు జరిపి ప్రయోజనం వుండదు.

పాతపాటి రమేష్ నెల్లూరు

ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితేమిటి?

కాన్వెంటులు, రెసిడెన్షియల్, కార్పొరేట్ విద్యా సంస్థల మీద జనం అతి మక్కువ చూపుతున్నారు. వేల రూపాయలు ఖర్చుపెట్టి తమ పిల్లలను వీటిలో చేర్చను పోటీ పడుతున్నారు. ఇక్కడ అర్హత కల్గిన ఉపాధ్యాయులు లేకపోయినా పట్టించుకోవడం లేదు. కార్పొరేట్ స్కూళ్ల వల్ల గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలతోపాటు, ప్రతిష్టాత్మక గురుకులాలు సైతం విద్యార్థులు లేక మూతపడే పరిస్థితికి వస్తున్నాయి. ఈ వ్యవహారమై ప్రభుత్వం చిత్తశుద్ధితో తగు చర్యలు తీసుకోవాల్సినవసరం ఎంతైనా వుంది.

పి.అరుణకుమారి నెల్లూరు

పదరంగం -76

నిర్వహణ : బాబాజీ

1		2	■	3		4	■	5	6
	■	7			■	8			
9	10	■	■	11	12		■		■
13		14	15	■	16		17	■	■
■	18			■		■		■	19
20			■	21	■	22		23	
	■	24	25			■	26		
■	27	■	28		■	29	■	■	■
30		31		■	32		33		■
	■	34			■	35		■	36

అడ్డం

1. సూకరం, పంది (3)
3. విశ్రాంతి, గ్యాప్ (3)
5. అటునుంచి, కేంద్రపాలిత ప్రాంతం, విహార కేంద్రం (2)
7. తెలుగు అడ్వైజు (3)
8. తనయ అంటే కూతురు ... కుమారుడు...? (4)
9. అటునుంచి, "..... దగు నెవ్వరు చెప్పిన..." (2)
11. ఆ రంగు గీతనాదే 2,4,6 అక్షరాలు (3)
13. పరిత్యాగి (4)
16. తెలుగుడోర్ (3)
18. గాడిద (3)
20. దండోరా (3)
22. కొండ (4)
24. ప్రథమా విభక్తి ప్రత్యయాలు (4)
26. దేవతలు, అసురులు కాదు (3)
28. రక్తనాళం (2)
30. చలనం (4)
32. కండ్లు, నేత్రాలు (4)
34. బలిమి, వాపుకాదు (3)
35. లవకుశులలో మొదటివాడు (2)
36. అచ్చులలో మొదటిది అడ్డం 26తో కలిస్తే రాక్షసులు (1)

నిలువు

1. తెలుగు ప్రోజు, వచింపబడినది (4)
2. దేవలోకపు బాతు (2)
3. విహరించడం (3)
4. సంప్రదింపులు (4)
5. గాలి (3)
6. బాధ, సంకటం (2)
10. వ్యతిరేకము, సుముఖము కాదు (4)
12. పాట, తలతెగిన సంగీతము (3)
14. క్షురకర్మ చేయువాడు (4)
15. పావురము 2,4 అక్షరాలు (2)
17. పుష్యమి ముందు నక్షత్రం (4)
19. సర్పములు (3)
20. క్రింద నుంచి రాజుగారి ఆవాసము (2)
21. కపోతం (3)
23. చెట్లు (4)
25. నీటిలో మునగడాలు (4)
27. భీముని ఆయుధం (2)
29. చంచల స్వభావం కలది (3)
30. కవిత్వం వ్రాసే వాడు (2)
31. క్రింద నుంచి ఆత్మత్యాగం (2)
33. నీటిలో ప్రయాణ సాధనం (2)

సమాధానాలు

పదరంగం -75

1చో	ద	2కు	3డు	■	4సో	5మ	వా	6రం	■
ద్యం	■	7మా	రు	తి	■	రో	■	8గ	ది
■	9తం	రి	చో	■	10ఆ	లో	చ	న	■
11చి	త్రం	■	■	12క	న	కం	■	■	13ఆ
రు	■	14శ	15రా	ని	■	■	16క్లా	మా	రం
17నా	య	కు	డు	■	18ఉ	ల్ల	ము	■	భం
మా	■	నం	■	19అ	ద	■	20ది	21ఆ	■
■	22వి	■	23జో	న్న	కం	24కి	■	25ద్యం	26పా
27ప్ర	ధా	ని	■	దా	■	28శో	భి	త	ము
29జ	త	■	30అ	నం	తం	రం	■	ము	■

● తెలుగు ప్రాచీన సాహిత్య సంపదను తెచ్చుకోకపోతే...

తెలుగు తల్లిని ఎట్లా గౌరవించిన వాళ్లమవుతాం!

భారతదేశం నుంచి అరబ్బులు, ఆఫ్ఘన్‌లు, ఫ్రెంచి, డచ్చి, బ్రిటీష్ వంటి విదేశీయుల ద్వారా అనంతమైన భారతీయ సంపద విదేశాలకు వెళ్లిపోయింది. ఒక దేశ సంస్కృతి సాహిత్యానికి సంబంధించి ఏవైనా 'జ్ఞాపికలు'పోతే జాతి నిర్జీవమైనట్లే లెక్క. కోహినూర్ వజ్రం, నెమలి సింహాసనం బ్రిటీష్ వాళ్ల పాలయిపోయాయి. మొదట్లో భారత సింహాసనం ఆవేశకావేశాలకు లోనయింది. పెద బొబ్బలు పెట్టింది. చివరికి సాధించిందేమీ లేదు. క్రమేణా ఈ విషయాల్ని ప్రజలూ, ప్రభుత్వమూ మరచి పోయారు. తెలుగునాట, మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో ఆయా రాష్ట్ర సంస్కృతులకు అద్దం పట్టే విలువైన వస్తువులు పరాయి ముష్కరులు పట్టుకుపోయినపుడు వెలమలు, రెడ్లు, షాహాజీలు(మహారాష్ట్ర), రసపుత్రులు(రాజస్థాన్) ప్రాణాలొడ్డి వాటిని తీసుకు వచ్చిన ఘటనలు చరిత్రలో కోకొల్లలున్నాయి. అవి ఆత్మాభిమానానికి నిదర్శనాలు.

తెలుగు అధికార భాషగా అమలుకు ఒక ప్రక్క ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్లు జారీ చేస్తుంటే, భాషా సంఘం అధ్యక్షులు, సభ్యులు తమకు బాధ్యతలే తప్ప అధికారాలు లేవని చేతులెత్తేస్తున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి ఆంధ్రులలో చైతన్య పుటాలోచనలను ప్రోదిచేసిన ఈ సందర్భంలో ఒక ప్రక్క పాఠశాలలు విద్యార్థులు లేక బడులు మూత బడుతున్నాయి. అనుకూల వ్యతిరేక సందిగ్ద పరిస్థితుల్ని ప్రజలు, ప్రభుత్వమూ పూర్తిగా తుడిచి పెట్టక పోతే "తెలుగు వాళ్లు" ప్రక్క రాష్ట్రాలలో నవ్వుల పాలవుతారు. మనకూ తలవంపులే కదా? తెలుగు భాష పట్ల సంస్కృతుల పట్ల నిర్దుష్టమైన, పటిష్టమైన, ఒక పట్టుదల లేకపోతే తెలుగు భాష అమలు ఒక ప్రహసనంగా మారిపోదా? మేధావులు, ఉపాధ్యాయులు ఆలోచించాలి!

తెలుగు భాష, తల్లి భాష అయినపుడు భాషను గౌరవించడం మన బాధ్యతగా భావించాలి కదా? అట్లా అనుకొన్నప్పుడు ఎంత నిబద్ధత వుండాలి? తెలుగు భాషా సంస్కృతులను ఎంతవరకూ ఆదరించాం? వ్యక్తిగతంగా మనలో ఎంత భక్తి వుంది? కుటుంబపరంగా మన ఆదరణ ఏ విధంగా ప్రతి ఫలించింది? దాదాపు 2005 జూన్ రెండవ వారంలో విడుదల అయిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నియమనిబంధనలన్నీ కూడా తెలుగులోనే వెలువరించాలి కదా? మనం ఈ విషయంలో ఎంతవరకూ సఫలీకృతులయ్యాం? అందులోని లోటుపాట్లేమిటి? సాధించిన అభివృద్ధి ఎంత అనే విషయాన్ని బేరీజు వేసుకోవాలి.

ప్రక్క రాష్ట్రాలలోని సాహిత్య సంపదనపై ఓ విశ్లేషణ!


పాయసం సుబ్రహ్మణ్య మహర్షి

ఈ విషయాన్ని అంటుంచితే ప్రాచీన తెలుగు సాహిత్యానికి సంబంధించిన తాళపత్ర గ్రంథాలు, లిఖిత ప్రతులు మద్రాసు అవిభక్త రాష్ట్రంలో మనం వున్నప్పటి నుంచి అవి చెన్నైలోనే వున్నాయి. ఆ తర్వాత ఔత్సాహికులు మరికొన్ని సేకరించి వారికి అందజేశారు. ఇవన్నీ కూడా తంజావూరు సరస్వతీ గ్రంథాలయంలోనూ, మద్రాసు ప్రాశ్య లిఖిత గ్రంథాలయంలోనూ వున్నాయి.

మెకెంజీ, సి.పి.బ్రౌన్ సేకరించిన ఎన్నో అపురూపమైన ప్రతులు వీటిలో వున్నాయి. అవి వేల సంఖ్యలోనే వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ విషయాలు తెలుసా? తెలిస్తే ప్రయత్నాలు చేశారా? ఇంతకాలంగా మన సంస్కృతి, సాంప్రదాయాలకు చెందిన సాహిత్యం ప్రక్క రాష్ట్రాలలో ఉండిపోవడానికి కారణం ఏమిటి? మన తెలుగును ప్రోది చేసుకోవాల్సిన, భద్రపరచుకోవాల్సిన, సంరక్షించుకోవాల్సిన కార్యక్రమం కంటే మనకు ముఖ్యమైన కార్యక్రమం మరొకటి వుంటుందా? మనకు తల్లి భాష పట్ల బాధ్యత లేదా? పొరుగు రాష్ట్రాలను చూసైనా నేర్చుకోవలసిన స్థితి, పరిస్థితి లేదా? ఇట్లా ప్రశ్నించుకొంటూపోతే ఎంతగానో హృదయం బాధకు, వేదనకు గురౌతుంది.

వ్యక్తులు, సమాజమూ, రచయితలూ, కళాకారులూ, మేధావులూ కలిస్తే ఒత్తిడితెస్తే ప్రభుత్వమూ కదులుతుంది. కదలవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. మనకు పరిస్థితులు, దుస్థితులూ అన్నీ తెలుసు. ఎవరూ చెప్పవలసిన అవసరం లేదు. అయితే చేయవలసిందల్లా మనం తొలుత ముందడుగు వేయడం. ఇతరుల్ని నడిపించడం. చైతన్య శంఖం పూరించడం.

ఒక్కసారి కదలిక వస్తే అది వాగవుతుంది, వరదవుతుంది, ప్రవాహమవుతుంది, ఉప్పెన అవుతుంది, ఒక ఉద్యమం అవుతుంది. వంద రాజకీయ శక్తులు చేయలేని పనిని ఒక ఉద్యమం నెరవేరుస్తుంది. అలా జరగాలని తెలుగు భాష సంస్కృతి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ దీక్ష తీసుకోవాలని, ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నది నా ఆశ ఆకాంక్ష. భవిష్యత్తులో పిల్లాపాపలంతా తెలుగు నేర్చుకొని, అధికార భాషగా తెలుగును అమలు చేద్దామని, మన తల్లి భాషను గౌరవిద్దామని ప్రతిజ్ఞ చేద్దాం. తెలుగు భాషకు జయ జయధ్వానాలు పలకండి. తెలుగు జాతికి కీర్తి పతాకలు కండి.



రైతు లోకం మామిడి తోటలలో కాయల కోత అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలు!

మామిడి తోటలలో పడివున్న టెంకలను ఏరివేసి భూమిలో ఫాలిడాల్ పొడిమందును చెట్ల పాదుల్లో వేసి కలియబెట్టాలి. కోతలు అయిన వెంటనే అవకాశం వున్న రైతులు పాదుల్లో నీరు పారించినట్లయితే చెట్లు త్వరగా కోలుకొంటాయి. 20 రోజుల విశ్రాంతి తర్వాత కత్తిరింపుల ద్వారా శాఖీయ పెరుగుదలను నియంత్రించాలి. కత్తిరింపుల సమయంలో గత సీజనులో పూత కొమ్మలు, ఎండిన కొమ్మలు, తెగులు కొమ్మలు, నేలకు వ్రేలాడుతున్న కొమ్మలు, చెట్టులోపల ప్రధాన కొమ్మలపై అడ్డదిడ్డంగా పెరుగుతూ గాలి, వెలుతురు తగలని కొమ్మలు తొలగించి గాలి, వెలుతురు లోపలి భాగాలకు సోకేలా కోసి తీసివేయాలి. కత్తిరింపులు అయిన వెంటనే కోసిన భాగాలకి విధిగా బోర్డోపేస్ట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్ట్ పూయాలి. లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 10గ్రాముల యూరియా, 2 గ్రాముల బోరాక్స్ కలిపి కత్తిరించిన చెట్లపై స్ప్రే చేయడం వల్ల కొత్త చిగుర్లు తొందరగా ఏర్పడి ఆరోగ్యంగా పెరగటానికి తోడ్పడతాయి. వర్షాలు పడిన వెంటనే తోటలను శుభ్రంగా దున్ని ఆకులు విస్తరించినంత మేర పాదులు చేసుకోవాలి. సేంద్రీయ ఎరువులు ఎక్కువగా వాడాలి. పది సంవత్సరాలు, ఆ పైబడిన చెట్లకు 1 కిలోనత్రజని (2.2 కిలోల యూరియా), 1 కిలో పొటాషియం (1.6 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్), 1 కిలో భాస్వరం (6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) ఎరువులను చెట్టు ప్రధాన కాండం నుంచి 1.5 మీటర్ల నుంచి 2 మీటర్ల దూరంలో పాదులు వేయాలి. సూక్ష్మ పోషకాల లోపాలు అధికంగా వున్నట్లయితే చెట్టుకి 50–75 గ్రాముల బోరాక్స్, 125–150 గ్రాముల జింకుసల్ఫేట్ మరియు 125–150 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ పాదులో వేయాలి.

డాక్టర్ కె.పుల్లంరాజు
కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

ఆర్థిక సంస్కరణల పాపాలు తప్ప...

ఫలితాలు భారతీయులకు అందడం లేదు!

- రిలయన్స్ కంపెనీ కృష్ణ - గోదావరి బేసిన్‌లో గ్యాస్ బావులు పొంది రాయితీలు హెచ్చింపుల పేర వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దిగమింగేస్తోంది.
- ఆర్థిక సంస్కరణలతో ఐదేళ్లలో కోలుకొన్న అమెరికా.
- ఇవే సంస్కరణలతో చైనా ప్రజల తలసరి ఆదాయం 9 వేల డాలర్లు చేరింది.
- కాని మన తలసరి ఆదాయం 1200 డాలర్లే.
- రిలయన్స్ దోపిడీపై నోరు మెదపని బిజెపి.



కెజి బేసిన్‌లో రిలయన్స్ ఏర్పాటు చేసిన గ్యాస్ ఉత్పత్తి కేంద్రం.

దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే సంస్కరణలు ఒక్కటే మార్గం అన్నది గత ఇరవై ఏళ్లుగా విన్పడుతున్న మాట. పివి.నరసింహారావు ప్రధాని అయ్యే నాటికి దేశం పూర్తిగా దివాలా తీసింది. అప్పటి ప్రధాని చంద్రశేఖర్, రిజర్వు బ్యాంక్ దగ్గరున్న బంగారు ముద్దలను విమానంలో లండన్‌కు తరలించి, అక్కడ తాకట్టు పెట్టి, అత్యవసర అప్పులు కట్టాడు. ఏ దేశానికైనా అంత కంటే అవమానకర పరిస్థితి వేరొకటి వుండదు. అప్పటి నుంచి ఆర్థిక సంస్కరణల నామస్మరణతోనే కాలం గడుపుతున్నాయి ప్రభుత్వాలు. ఆ మాట వినీ వినీ జనానికి విసుగు వచ్చింది. అసలు సంస్కరణలు అంటే ఏమిటి అనే ప్రశ్నకు ప్రజలకు వివరణ ఇచ్చేవారు లేరు. ఒకవేళ ఆర్థికమంత్రులు చెప్పినా సాధారణ జనానికి అర్థం కాదు. అదేదో బ్రహ్మ పదార్థం వలె విన్పిస్తుంది.

అయితే సంస్కరణ ఫలితం ప్రజల అనుభవంలోకి రావడానికి ఒకటి రెండు దశాబ్దాల మించి సమయం అవసరం లేదు. ఐదేళ్ల క్రితం అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలింది. పెద్ద పెద్ద ఆర్థిక సంస్థలు దివాలా తీశాయి. ఆ పరిస్థితి చక్కదిద్దడానికి అమెరికన్ అధ్యక్షులు సంస్కరణలు చేపట్టారు. ఈ స్వల్ప కాలంలోనే వాటి ఫలితాలు వారికి కన్పించాయి. సంకటంలో వున్న రంగాలకు ప్రభుత్వ ఉద్దీపన పథకాల అవసరం ముగిసిందని ఫెడరల్ బ్యాంక్ ప్రకటించింది. దాని ఫలితమే మన దేశం నుంచి పెద్ద ఎత్తున డాలర్లు అమెరికాకు రివ్వున ఎగిరిపోవడం; మన రూపాయి పతనమై పోవడం. మన దేశంలో సంస్కరణలు ప్రారంభించి పాతికేళ్ల సుదీర్ఘ గడువు కూడా చాలడం లేదు ప్రభుత్వాలకు. ఇప్పటికీ ఆ పల్లవినే ఆలపిస్తున్నారు పాలకులు. పాతికేళ్ల సంస్కరణల వల్ల భారత ప్రజానీకానికి ఏ ఫలితం సిద్ధించింది అన్నది ప్రశ్న. 1990లో భారతీయుల తలసరి రాబడి 647 డాలర్లు. ఇప్పుడు 1200 డాలర్లు. అంటే ప్రజల జీవన ప్రమాణం రెట్టింపు కావడానికి పాతికేళ్ల సమయం పట్టిందన్న మాట. అదే 1995లో చైనా ప్రజల తలసరి రాబడి 1200 డాలర్లు. కానీ ఇప్పుడు వారి స్థాయి 9వేల డాలర్లకు చేరుకొన్నది. అంటే దాదాపు ఏడింతలు పెరిగిందన్న మాట. చైనాలో ఆర్థిక సంస్కరణలు అక్కడి ప్రజలకు అంతటి ఫలితాలిస్తే భారతదేశంలో మాత్రం ప్రజల జీవన ప్రమాణం ఎదుగు బొదుగు లేకుండా పడిపోతున్నది. పెరిగిన ధరలు, వస్తున్న రాబడులతో వాస్తవిక రాబడిని లెక్క కడితే 1995 నాటి కంటే మన జనం జీవన ప్రమాణం ఏ మాత్రం మెరుగు పడలేదని అర్థమౌతుంది. దీని అర్థం సంస్కరణల పాపాలు తప్ప ఫలితాలు భారతీయులకు అందడం లేదని. దానికి కారణం ఆర్థిక సంస్కరణల అమలు సరైన దారిలో నడవక పోవడం.



దేశాన్ని దోచేస్తున్న రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ.



మాజీ పెట్రోలియం శాఖా మంత్రి జైపాల్‌రెడ్డి.

జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ అనుసరించిన సామ్యవాద పోకడల వల్ల, లైసెన్స్ రాజ్ విధానం వల్ల భారతదేశం ఆర్థికంగా ఎదగలేక పోయిందన్నది సంస్కరణల వాదుల వాదన. ఆ వర్గానికి అధినేత మన్మోహన్‌సింగ్. నెహ్రూ, ఇందిరమ్మలు జాతీయ సంపద మొత్తం జాతికే చెందాలని, ప్రైవేట్ పరం కాకూడదని భావించారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా మాత్రమే సహజ వనరుల వినియోగం జరగాలని భావించారు. కానీ సంస్కరణల పేరిట ఆ విధానాన్ని తిరగ్రాశాడు మన్మోహన్‌సింగ్. సహజ వనరుల యాజమాన్యం మొత్తాన్ని ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టాడు. అది 2జి రేడియో తరంగాలైనా, బొగ్గు గనులైనా, ఇనుప ఖనిజమైనా, సహజ వాయువైనా, పెట్రోల్ బావులైనా, బాక్సైట్ గనులైనా, జల విద్యుత్ ప్రాజెక్ట్‌లైనా, థర్మల్ కరెంట్ కేంద్రాలైనా, జాతీయ రహదారులైనా, ఓడరేవులైనా, విమానాశ్రయాలైనా ప్రైవేట్ సంస్థలకే ప్రాధాన్యత ఇచ్చారు. దానివల్ల వనరుల వినియోగం వేగంగా జరిగి, పారిశ్రామిక వృద్ధి నమోదై, దేశం ఆర్థికంగా ప్రగతి పథంలో పరుగులు పెడుతుందని ప్రజలకు నమ్మబలికాడు. కానీ పాతికేళ్ల తర్వాత వెనక్కి తిరిగి చూసుకొంటే జరిగింది పూర్తిగా వేరని అర్థమై పోతుంది. ప్రభుత్వం ప్రైవేటు పరం చేసిన ప్రతి సహజ వనరు విషయంలో కుంభకోణాలు వెలికి వస్తున్నాయి. తొమ్మిదిన్నరేళ్ల యూపిఏ ప్రభుత్వ హయాంలో వెలికి వచ్చినన్ని అవినీతి దుర్మార్గాలు అన్నీ ఇన్ని కావు. ప్రతి కుంభకోణం వెనుకా ఆర్థిక సంస్కరణల ప్రభావం వుంది. ఒక ప్రక్క జాతీయ సహజ వనరులను దోచుకోవడమే కాక ఈ పారిశ్రామికులు మన బ్యాంకులను కూడా లూటీ చేశారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, విద్యుత్ ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టిన ప్రతి కార్పొరేట్ కంపెనీ కూడా బ్యాంకులకు వేలాది కోట్ల రూపాయలు బాకీ పడి వుంది ఇప్పుడు. సంస్కరణల పేరుతో వారు చేసిన అభివృద్ధి కంటే దోచుకొన్న ప్రజల సొత్తు ఎన్నో రెట్లు అధికంగా కన్పిస్తున్నది. దేశానికి ఇంత దారుణమైన అపకారం జరిగిన తర్వాత కూడా సంస్కరణ వాదుల తీరు మారక పోవడం విచిత్రమే కాదు, విషాదం కూడా. వారి కరడు గట్టిన పెట్టుబడిదారీ పోకడకు తాజా ఉదాహరణ రిలయన్స్ కంపెనీకి లక్షలాది కోట్ల రూపాయల లాభం చేకూర్చి పెట్టే సహజ వాయువు ధర నిర్ణయం.

ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ బావులు

కృష్ణ గోదావరి నదుల పరీవాహక ప్రాంతంలో ప్రపంచంలోనే అతి పెద్ద సహజ వాయు నిల్వలున్నట్లు కనుగొన్నారు. 50 కిలోమీటర్ల విస్తారమైన ప్రాంతంలో లెక్కకు మించిన పెట్రోల్ బావులు బయట పడ్డాయి. ఇప్పటి వరకు రిలయన్స్, ఓఎన్‌జిసి, గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ సంస్థలు సహజ వాయువు వెలికి తీయడంలో సఫలీకృతమయ్యాయి. ఇంకా బయటపడవలసిన నిల్వలు విస్తారంగా వున్నాయి. ఈ మూడు కంపెనీలు నిర్మించిన బావులలో 64 ట్రిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్ నిల్వలున్నాయని అంచనా. వీటిని సక్రమంగా వాడుకొంటే దేశంలో ఎరువులు, విద్యుత్ కొరత పూర్తిగా తీరిపోతుంది. బొంబాయి హై కంటే 40 రెట్లు అధికంగా గ్యాస్ నిల్వలు కనుగొన్నట్లు రిలయన్స్ చేసిన ప్రకటన చూసి యావత్ జాతి ఎంతో ఆనందం వ్యక్తం చేసింది. దేశ ఇంధన స్థితిగతులను మార్చి వేయగలదని ఆశపడింది. అనుకొన్నట్లే రిలయన్స్ కంపెనీ చాలా త్వరగా గ్యాస్ వెలికి తీయడం ప్రారంభించింది. 2010 నాటికి రోజుకు 67 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ బయటకు తీసింది. దాన్ని నమ్ముకొని ఆంధ్రా, కర్నాటక, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలను త్వరత్వరగా నిర్మించారు. కానీ వున్నట్లుండి రిలయన్స్ కంపెనీ గ్యాస్ ఉత్పత్తిని తగ్గించి వేసింది. ఇప్పుడు వారు ఉత్పత్తి చేస్తున్న గ్యాస్ రోజుకు 14 మిలియన్ క్యూబిక్ మీటర్లు మాత్రమే. దానితో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలన్నీ మూతపడ్డాయి. వాటి మీద పెట్టిన వేలాది కోట్ల రూపాయల పెట్టుబడి వృధా అయిపోయింది. మరొకప్రక్క దేశంలో కరెంట్ కోత తీవ్ర రూపం దాల్చింది. కరెంట్ లేక పరిశ్రమలు మూత పడుతున్నాయి. లక్షలాది మంది నిరుద్యోగులుగా మారుతున్నారు.



ఇప్పటి పెట్రోలియం శాఖా మంత్రి వీరప్ప మొయిలీ.

కొరవ 16వ పేజీలో

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com